

స్వర్ణగరుడుడిపై పెంచలోరు!

రాపూరు (డక్కిలి) : పెంచలకోనకు భక్తజనం పోటెత్తింది. కోనేరులో స్నానమాచరించిన భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకొని మొక్కులు తీర్చుకున్నారు. తెలుగు సంవత్సరాది సందర్భంగా తెల్లవారుజామున స్వామి, అమ్మవార్లకు పట్టు వస్త్రాల సమర్పణ, 5 గంటలకు పూలంగిసేవ జరిగింది. ఉదయం 8.30 గంటలకు స్వర్ణ గరుడుడిపై శ్రీవారు ఊరేగుతూ భక్తుల కటాక్షించారు. 10.30 గంటలకు పంచాంగ శ్రవణం, 11 గంటలకు స్వామి, అమ్మవార్ల కల్యాణం కన్నుల పండువగా సాగింది. సాయంత్రం 6 గంటలకు గోనుపలిలో అర్చకుల మంత్రోచ్చరణ నడుమ గరుడ సేవ జరగింది. భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా ఆలయ కమిషనర్ కేవీ. సాగర్ బాబు ఏర్పాట్లను పర్యవేక్షించారు.



ఇరుకళల పరమేశ్వరి ఆలయంలో భక్తుల రద్దీ



ఇరగాళమ్మ గ్రామోత్సవంలో నిప్పుకుండతో భక్తుడు





వెండి నందిపై ఆదిదంపతుల వైభోగం

బుచ్చిరెడ్డిపాళెం : జొన్నవాడ క్షేత్రంలో మంగళవారం రాత్రి మల్లికార్జున, కామాక్షితాయి పెద్ద వెండి నంది వాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనభాగ్యం ఇచ్చారు. అలాగే పెనుబల్లిలో పారువేట ఉత్సవ జరిగింది. ముందుగా ఆలయంలో ఆదిదంపతులను కుంభహారతి మండపంలో కొలువుదీర్చి ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. చెప్పి ఆదాయ, వ్యయాలు, వినిపించి అనంతరం భక్తుల పేరుతో ఆదాయ వ్యయాలు, రాజ్య పూజ్యములు, అవమానములు వివరిస్తూ పంచాంగ శ్రవణం చెప్పారు. అనంతరం స్వామి, అమ్మవార్లను చిన్న వెండి నందిపై కొలువుదీర్చి ఆలయం చుట్టూ ఊరేగించారు.



ఉదయగిరి రూరల్ : నర్రవాడలో ప్రత్యేక అలంకరణలో వెంగమాంబ పేరంటాల దంపతులు

వైభవంగా ఉగాది



మూల స్థానేశ్వ రాలయంలో శాకంబరి అలంకరణ



● మూలస్థానేశ్వరాలయంలో భువనేశ్వరి అమ్మవారికి శాకంబరి అలంకారం జరిగింది. వివిధ రకాల పండ్లు, కూరగాయలు, పూలతో చేసిన అలంకరణ భక్తులను ఆకట్టుకుంది. ఈ ఏడాది సకాలంలో వర్షాలు కురిసి పాడి పంటలు సమృద్ధిగా ఉండాలని, ప్రజలందరూ సుఖశాంతులతో గడపాలని కోరుతూ ఈ అలంకరణ చేశారు.

● రాజరాజేశ్వరి ఆలయంలో ప్రధాన అర్చకుడు రఘు రామశర్మ ఆధ్వర్యంలో ఉదయం అభిషేకాలు, ప్రత్యేక పూలంగిసేవ, చండీ హోమం, పంచాంగ శ్రవణం జరిగాయి. సుందరేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం సందర్భంగా మహన్యాస పూర్వక రుద్రాభిషేకాలు, విశేష పూజలు, ప్రత్యేక అలంకారాలు జరిగాయి. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు ప్రాకారోత్సవాలు జరిగాయి. ఆలయ చైర్మన్ రత్నం జయరామ్, సహాయ కమిషనర్ జే వెంకటసుబ్బయ్య పర్యవేక్షించారు.

నెల్లూరు గ్రామదేవత ఇరుకళల పరమేశ్వరికి నగరోత్సవం వైభవంగా జరిగింది. ఉదయం అమ్మవారికి విశేష అభిషేకాలు, పూలంగి సేవ జరిగాయి. భక్తులు మొక్కులు చెల్లించుకుని అంబలి సమర్పించారు. మధ్యాహ్నం అన్నదానం చేశారు. రాత్రి విశేష పుష్ప, విద్యుత్ దీపాలంకరణ, తప్పెట్లు, మంగళ వాయిద్యాలు, బాణాసంచా వేడుకలతో అమ్మవారి నగరోత్స వం దేదీప్యమానంగా జరిగింది. ఆలయ మాజీ చైర్మన్లు మెట్టు సురేష్, ఇందుకూరు రమేష్ ఆచారి, ఆలయ ఈవో బీ మల్లికార్జున్‌రెడ్డి పర్యవేక్షించారు.

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 : శ్రీక్రోధినామ తెలుగు సంవత్సరానికి స్వాగతం పలుకుతూ జిల్లా ప్రజలు మంగళవారం ఉగాది పండుగను ఘనంగా జరుపుకున్నారు. నూతన వస్త్రాలు ధరించి, ఇష్టదైవాన్ని పూజించి ఉగాది పచ్చడి సేవించారు. అన్ని శైవ, వైష్ణవ ఆలయాలతోపాటు సాయిబాబా మందిరాల్లో ప్రత్యేక పూజలు, అలంకారాలు ఉత్సవాలు జరిగాయి. జిల్లా వ్యాప్తంగా గ్రామ దేవతలకు విశేష అభిషేకాలు, పూజలు చేసి చద్ది, పొంగళ్లు సమర్పించారు. ఎన్నికల సంవత్సరం కావడంతో టీడీపీ, వైసీపీ, జనసేన, కాంగ్రెస్.. ఇతర పార్టీల కార్యాలయాల్లో ప్రత్యేక పంచాంగ శ్రవణం ఏర్పాటు చేశారు. ఎన్నికల్లో విజయం సాధించేందుకు గ్రహదోష నివారణోపాయాలను పండితుల ద్వారా తెలుసుకున్నారు.



● **తల్పగిరి రంగనాథస్వామి**

ఆలయంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత రంగనాథ స్వామికి తిరుమంజనం జరిగింది. అనంతరం విశేష పూలంగిసేవ జరిగింది. రాత్రి పంచాంగ శ్రవణం అనంతరం స్వామి, అమ్మవార్ల పేట ఉత్సవం కనుల పండువగా జరిగింది. శ్రీరామ హనుమాన్ భక్త బృందం, పాదర్తి బాలాజీ ఆధ్వర్యంలో ఉదయం 7 గంటల నుంచి భక్తులకు ప్రసాదాలు పంపిణీ చేశారు. ఉగాది వేడుకలను ఆలయ చైర్మన్ మంచికంటి శ్రీనివాసులు, సహాయ కమిషనర్.. ఈవో డబ్బుగుంట వెంకటేశ్వర్లు పర్యవేక్షించారు.

● జిల్లా ప్రజలకు రాజ్యసభ సభ్యుడు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఎంపీ ఆదాల ప్రభాకర్‌రెడ్డి, వ్యవసాయ శాఖ మంత్రి కాకాణి గోవర్ధన్‌రెడ్డి, జిల్లా కలెక్టర్ ఎం హరినారాయణన్, మాజీ మంత్రి పొంగూరు నారాయణ, రూరల్ ఎమ్మెల్యే అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి, టీడీపీ నెల్లూరు పార్లమెంటు నియోజకవర్గ అధ్యక్షుడు అబ్దుల్ అజీజ్ వేర్వేరు ప్రకటనల్లో ఉగాది పండుగ శుభాకాంక్షలు తెలియజేశారు.





మద్యం కోసమేనండీ!

మద్యం కోసం దుకాణాల ముందు మందుబాబుల తాకిడి ఎక్కువైంది. అనంతసాగరం మండలంలోని సోమశిల, అనంతసాగరం, చిలకలమర్రి, రేవూరు గ్రామాల్లో ప్రభుత్వ వైన్‌షాపులు ఉన్నాయి. ఎన్నికల సందడి మొదలు కావడంతో మద్యం కొనుగోళ్లు పెరిగాయి. ఈ క్రమంలో ఎన్నికల కమిషన్ నియంత్రణ చర్యల్లో భాగంగా అమ్మకాలపై రోజు వారి టార్గెట్ విధించారు. ఆ మేరకు అమ్మకాలు పూర్తయితే షాపులు మూసేవిధంగా చర్యలు చేపట్టారు. దీంతో మద్యం కోసం షాపుల వద్ద మందుబాబులు క్యూ కడుతుండగా ఆయా ప్రాంతాల్లో తోపులాట జరుగుతోంది. మరోవైపు షాపులు మూసేశాక బయట వ్యక్తులు అధిక ధరతో మద్యం అమ్ముతూ అక్రమార్జనకు పాల్పడుతున్నారు. చిలకలమర్రిలో మద్యం సీసాపై రూ.50 నుంచి 100 వరకు అదనపు రేటుతో విక్రయిస్తు న్నట్లు సమాచారం. ఇదే పరిస్థితి మిగిలిన ప్రాంతాల్లోనూ నెలకొంది.

\- అనంతసాగరం

వలంటీర్లు... వైసీపీ సేవ !

- 20 రోజుల్లో 981 మంది రాజీనామా
- ఇంకా భారీగా వస్తున్న దరఖాస్తులు
- కావలి, కోవూరుల్లోనే అత్యధికం

నెల్లూరు, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : జిల్లాలో రాజీనామా చేసే వలంటీర్ల సంఖ్య రోజురోజుకు పెరుగుతోంది. ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చిన తర్వాత నుంచి ఈనెల 7 వరకు 981 మంది రాజీనామా చేశారు. ఇంకా వందల సంఖ్యలోనే రాజీనామా దరఖాస్తులు పెండింగ్‌లో ఉన్నాయి. వీటన్నింటినీ ఆమోదిస్తే తొలగించిన వలంటీర్ల సంఖ్య మరింత పెరుగుతుంది. జిల్లాలో సుమారు 13 వేల మంది వలంటీర్లు ఉన్నారు. అంటే ఎన్నికల కోడ్ వచ్చిన ఇరవై రోజుల్లోనే దాదాపు పదిశాతం మంది వలంటీర్లు రాజీనామాలు ఇచ్చారు. ఇక ఎన్నికల నోటిఫికేషన్ వచ్చేందుకు మరో ఎనిమిది రోజులు, ఎన్నికలు ముగిసేందుకు మరో నెల గడువు ఉంది. ఈ లోపు ఇంకెంత మంది రాజీనామా చేస్తారన్నది ఆసక్తిగా మారింది.



● **బలవంతంగా రిజైన్**

కొంతమంది వలంటీర్ల చేత వైసీపీ నాయకులు బలవంతంగా రాజీనామా చేయిస్తుండగా, మరికొంతమంది మాత్రం స్వచ్ఛందంగా రాజీనామా చేస్తున్నారు. స్వతహాగా వీరంతా వైసీపీ కార్యకర్తలు కావడమే కారణం. ఇలా రాజీనామా చేసిన వలంటీర్లంతా వైసీపీ సేవలో తరిస్తున్నారు. ఎన్నికల సమయంలో వైసీపీ నాయకులతో కలిసి ఎన్నికల ప్రచారాల్లో పాల్గొంటున్నారు. ఇప్పటివరకూ వైసీపీ నేతలు చెబుతూ వచ్చిన పారదర్శకత, నిజాయితీ అంతా పచ్చి అబద్ధాలని వలంటీర్ల రాజీనామాలతో తేటతెల్లమవుతోంది. వలంటీర్ల ముసుగులో కొనసాగు తున్న వైసీపీ కార్యకర్తల బాగోతం బయటపడుతోంది.

● **ఆ రెండు చోట్లే అధికం**

వలంటీర్ల రూపంలో ప్రజల వ్యక్తిగత సమాచారం మొత్తాన్ని వీరు సేకరించారు. ఇప్పటి వరకూ రాజీనామా చేసిన వారిలో అత్యధికంగా కావలి, కోవూరు నియోజకవర్గాల నుంచే ఉన్నారు. కావలిలో 433 మంది, కోవూరులో 345 మంది వలంటీర్లు రాజీనామా చేశారు. తాజాగా నెల్లూరు నగరంలో కూడా భారీగానే వలంటీర్లు రాజీనామాలు అందించినట్లు తెలుస్తోంది. వీటిని అధికారులు ఆమోదించాక ఏ స్థాయిలో రాజీనామాలు చేశారన్నది స్పష్టమవుతుంది.

సందట్లో సడేమియాలా!?

'అధికారులంతా ఎన్నికల హడావిడిలో ఉన్నారు. అధికారం మన చేతుల్లో ఉంది. ఇంకేం కబ్జా చేసిన స్థలంలో భవనాలు కట్టేద్దాం.' ఇదీ కావలిలో కబ్జారాయుళ్ల తీరు. రూ.కోట్లు విలువైన స్థలాన్ని ఆక్రమించ డమేగాక వాటిల్లో నిర్మాణాలు చేపడుతున్నారు. వీరి వ్యవహారంపై అధికారులకు ఫిర్యాదులు అందినా పట్టీపట్టనట్టు వ్యవహరించడంపై విమర్శలు వ్యక్తమవుతున్నాయి.



మందాటి చెరువు ముందు ఆక్రమణకు గురైన స్థలం



ప్రభుత్వ స్థలంలో జోరుగా సాగుతున్న నిర్మాణాలు

కావలి, ఏప్రిల్ 9 : మందాటిచెరువు లోతట్టులోని రాళ్లగుట్ట ప్రాంతంలో అంకణం రూ.2లక్షలు పలుకుతోంది. ఇంత విలువైన ప్రభుత్వ భూములపై కబ్జారాయుళ్ల కన్ను పడింది. ఇంకేముంది.. ప్రభుత్వ స్థలం ఎక్కడుందో కనిపెట్టి అక్కడ పాగా వేసేస్తున్నారు. ఇలా సుమారు 200 అంకణాలపైన ఆక్రమించి ఐదారు భవనాలు నిర్మిస్తున్నారు. వీటిలో రెండు ప్రాంతాలలో గతంలో ఆక్రమించి దాని చుట్టూ కంచె, గడ్డివాములు వేసుకుని ఉన్నారు. అయితే, ఎన్నికల కోడ్ అమలులోకి రావటంతో మరలా ఏ ప్రభుత్వాలు వస్తాయో, వాటి పరిస్థితి ఎలా ఉంటుందోనని భావించిన ఆక్రమణ దారుల వాటి లోపల యథేచ్ఛగా నిర్మాణాలు చేపడుతున్నారు. ఈ ఆక్రమణదారులు అధికార పార్టీకి చెందిన నేతల ముఖ్య అనుచరులు కావటంతో వాటిపై ప్రజలు ఫిర్యాదు చేసినా అధి కారులు పట్టించు కోవటంలేదనే ఆరోపణలు ఉన్నాయి. ఇంతేగాక ఇం కొన్ని చోట్ల అధికార పార్టీ నేతలు తమకు అనుకూల సంస్థలకు వారి సొంత ఆస్తిలా ధారాదత్తం చేశారు. అన్ని శాఖల అధికారులంతా ఎన్నికల హడావుడిలో ఉండటంతో తాము దక్కించుకున్న స్థలాల్లో నిర్మాణాలు చేపట్టారు.

● **ఎవరికి వారే!?**

విలువైన స్థలం కబ్జా అవుతున్నా తమ పరిధి కాదంటూ ఇటు రెవెన్యూ, అటు మున్సిపల్ అధికారులు తప్పించుకుంటున్నారు. విలువైన స్థలం ఆక్రమణకు గురైనప్పుడు దానిని కాపాడుకో వాల్సిన బాధ్యత రెవెన్యూ అధికారులదని మున్సిపల్ అధికారులు చెబుతున్నారు. అయితే అక్రమ నిర్మాణాలు జరుగుతున్నప్పుడు వాటిని అడ్డుకోవాల్సి బాధ్యత మున్సిపల్ అధికారులదని రెవెన్యూ యంత్రాంగం చెబుతోంది. కాగా, కావలి ఆర్డీవో శీనా నాయక్ మున్సిపల్ ప్రత్యేకాధికారిగా కొనసాగుతుండగా రెండు శాఖలు ఆయన పరిధిలో ఉన్నా ప్రభుత్వ ఆస్తుల కబ్జా, అక్రమ నిర్మాణాలను పట్టించుకోకపోవటం వెనుక మర్మమేమిటని పట్టణవాసులు ప్రశ్నిస్తున్నారు. ఇప్పటికైనా ఉన్నత యంత్రాంగం స్పందించి విలువైన ప్రభుత్వ స్థలాలు కబ్జా కాకుండా కాపాడాలని కోరుతున్నారు.

వైసీపీ పాలనంతా దాచుకోవడం, దోచుకోవడమే!

- వారికి గుణపాఠం చెప్పేందుకు ప్రజలు సిద్ధం
- నెల్లూరు ఎంపీ టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి



ప్రచార రథంపై అభివాదం చేస్తున్న వేమిరెడ్డి, ఇంటూరి

గుడ్లూరు, ఏప్రిల్ 9 : రాష్ట్రంలో వైసీపీ పాలనతో ప్రజలు విసుగెత్తిపోయారని, ఆ పార్టీ నాయకులకు అక్రమంగా దోచుకోవడం, దోచుకున్నది దాచు కోవడం తప్ప, చేసిన అభివృద్ధి ఏమిలేదని ఎన్డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర రెడ్డి విమర్శించారు. మంగళవారం గుడ్లూరు, ఉలవపాడు, కందుకూరులలో అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలిసి ప్రచారం చేశారు. గుడ్లూరులో వేమిరెడ్డి, ఇంటూరిలకు టీడీపీ నాయకులు ఘనస్వాగతం పలికి ఊరేగింపుగా మిట్టపాలెం అంకమ్మ తల్లి ఆలయం వరకు వచ్చారు. అనంతరం టీడీపీ కార్యాలయంలో వేమిరెడ్డి మాట్లాడుతూ ఎన్నికల్లో ప్రజలు వైసీపీకి తగిన గుణపాఠం చెప్పేందుకు సంసిద్ధంగా ఉన్నారని అన్నారు. ఇంటూరి నాగేశ్వరరావు మాట్లా డుతూ వైసీపీ మోసాలను అన్ని విధాలుగా గ్రహించిన ప్రజలు మార్పును కోరుకుంటు న్నారని, టీడీపీ, జనసేన, బీజేపీల మద్దతుతో కూటమి అధికారం చేపట్టడం ఖాయమని ధీమా వ్యక్తం చేశారు. ఈ కార్యక్రమంలో ఒంగోలు పార్లమెంట్ టీడీపీ అధ్యక్షుడు నూకసాని బాలాజీ, ఒంగోలు డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాసరావు, జనిగర్ల నాగరాజు, మేకపోతుల రాఘవులు, పువ్వాడి వేణుగోపాల్, పోట్టేళ్ల మురళి, చిత్తారి మల్లికార్జున, చెన్నారెడ్డి మహేష్, ఉమ్మినేని సుబ్బారావు తదితరులు పాల్గొన్నారు.

● **టీడీపీలో చేరికలు**

వైసీపీకి చెందిన పలువురు నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరగా, వారికి పార్టీ కండువాలు కప్పి వేమిరెడ్డి ఆహ్వానం పలికారు. గుడ్లూరుకు చెందిన మాజీ సర్పంచ్ పారా జనార్దన్, కందుకూరు మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చెరుకూరి సూర్యనారాయణ, వలేటి నరసింహం, గుండ్లపాలెంకు చెందిన చేవూటూరి చెంచయ్య, చేవూటూరి రమేష్ తదితరులు టీడీపీలో చేరారు.

అప్పుడే గొంతెండుతోంది !



మెట్టప్రాంతంలో బిందెడు నీటికోసం వెంపర్లాట మొదలైంది. వేసవి ఆరంభంలోనే ఇలా ఉంటే రానున్న రోజుల్లో ఇంకెలా ఉంటోందనని ప్రజలు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. సీతారామపురం మండలంలోని సీతారామపురం, పబ్బులేటిపల్లి, గోనువారి పల్లి, బోడసిద్దయిపల్లి, పోలంగారిపల్లి, పడమటి రొంపి దొడ్ల తదితర గ్రామాల్లో నీటిఎద్దడి నెలకొంది. పంచాయతీల ద్వారా అందించే నీరే దిక్కుగా అనేక గ్రామాలు ఉన్నాయి. 4 నెలలుగా నీటి దుర్భిక్షం ఉన్నా ఆర్‌డబ్ల్యూఎస్ అధికారులు భవిష్యత్తు అవసరాలు దృష్టిలో పెట్టుకొని ప్రణాళికలు తయారు చేయకపోవడం, నిర్లక్ష్యం మూలంగా బిందెడు నీటి కోసం అవస్థలు పడాల్సి వస్తోంది. ప్రైవేట్ వాటర్ ప్లాంట్లతోపాటు గ్రామాలలోని సర్పంచ్‌లు తమ సొంత నిధులతో వాటర్ ట్యాంక్‌లతో నీటి సరఫరా చేస్తున్నారు. పబ్బులేటిపల్లి సర్పంచ్ మాట్లాడుతూ తమ పంచాయతీలో నీటి ఎద్దడి ఉన్నా అధికారులు ఎలాంటి చర్యలు తీసుకోలేదన్నారు. పంచాయతీలో నిధులు లేకపోవడంతో బోర్లను కూడా రిపేరు చేసుకోలేకపోతున్నట్లు చెప్పారు. ఇప్పటికైనా అధికారులు స్పందించి తమ దాహం తీర్చాలని ప్రజలు కోరుతున్నారు. అలాగే ఉదయగిరి లోని ఎస్టీ, మంగళగిరి కాలనీల్లోనూ నీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. నీటి సమస్య పరి ష్కరించాలని అధికారులకు మొరపెట్టుకున్నా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తున్నారని ఆ కాలనీవాసులు ఆరోపిస్తున్నారు. కొంతమంది దాతలు ఏర్పాటు చేసిన ట్యాంకర్ నీటితోనే గొంతులు తడుపుకుంటున్నారు.

\- సీతారామపురం/ఉదయగిరి రూరల్

సీతారామపురం : ట్యాంకర్ వద్ద పబ్బులేటిపల్లి వాసుల క్యూ



ఉదయగిరి రూరల్ : ట్యాంకర్ వద్ద నీరు పట్టుకుంటున్న కాలనీ వాసులు



సోమశిల ఉత్తర కాలువలో ఈత కొడుతున్న చిన్నారులు (ఫైల్)

సరదా మాటున శోకం !

- ఈత మిగుల్చుతున్న కడుపు కోత
- మృత్యువాత పడుతున్న చిన్నారులు

ఆత్మకూరు, ఏప్రిల్ 9: వేసవి వచ్చేసింది. ఇంటర్, పదవ తరగతి విద్యార్థులకు ఇప్పటికే సెలవులు ఇచ్చారు. వేసవిలో సేద తీరేందుకు ఈతకు వెళ్లే విద్యార్థులు, యువకులు ప్రాణాల మీదకు తెచ్చుకుంటున్నారు. సరదా కోసం వెళ్లేవారు చివరకు విషాదాన్ని మిగుల్చుతున్నారు. ముఖ్యంగా గ్రామాల్లో బావులు, చెరువుల్లో పిల్లలు ఈత కొట్టడం నిత్యకృత్యమవుతోంది. ఈతలో శిక్షణ లేకపోయినా చిన్నారులు సరదాగా మునిగేందుకు ఆసక్తి చూపుతుంటారు. ఆ సరదా మాటునే ప్రాణహాని పొంచి ఉంది.

● కుటుంబాలు చిన్నాభిన్నం

అప్పటివరకు ఆడుతూపాడుతూ, కుటుంబసభ్యులు మధ్య గడిపిన చిన్నారుల మృతితో కుటుంబాలు దిక్కుతోచని స్థితిలో చిన్నాభిన్నమవుతున్నాయి. వేసవిలో ఈత పేరిట నదులు, కాలువలు, బావులు, వంకల్లో తల్లిదండ్రులకు తెలియకుండానే చిన్నారులు ఈతకు వెళ్లి ప్రాణాలు కోల్పోతున్నారు. గత ఏడాది పొదలకూరు మండలం తోడేరుకు చెందిన పదిమంది యువకులు కొత్తచెరువులో నాటుపడవపై విహరించేందుకు వెళ్లి నలుగురు మృత్యువాతపడ్డారు. ఇలాంటి సంఘటనలే ప్రతి ఏటా జరుగుతున్నాయి. నివారణ చర్యలు చేపట్టాల్సిన అధికారులు మౌనం దాల్చుతుండడంతో ఏడాదికి 10 నుంచి 15 మంది చిన్నారులు మృత్యువాత పడుతున్నారు. ఇప్పటికైనా అధికారులు తల్లిదండ్రులను అప్రమత్తం చేసి నీటి వనరుల వద్దకు విద్యార్థులు వెళ్లకుండా చూడాల్సిన అవసరం ఎంతైనా ఉంది.

తీసుకోవాల్సిన జాగ్రత్తలు

- చెరువులు, బావుల్లో ఈతకెళ్లేవారు ఈత వచ్చినవారి సహాయం లేకుండా వెళ్లరాదు.
- ఈతరానివారిని నీటి వనరుల దగ్గరకు వెళ్లకుండా తల్లిదండ్రులు జాగ్రత్త పడాలి.
- కొత్తగా ఈత నేర్చుకుంటున్న పిల్లలు నడుముకు సొరకాయబుర్ర, బెండ్లు, రబ్బరు ట్యూబ్‌లు, తాళ్ల లాంటివి కట్టుకోవాలి.
- బావులు, కొలనుల్లో నీటి లోతును గమనించి ఈతకు దిగాలి.
- రాతికట్టడం ఉన్న బావుల్లో పైనుంచి దూకడం వలన అదుపుతప్పి రాళ్ల పైన పడే అవకాశం ఉంది.
- బావిపై నుంచి తలకిందులుగా నీటిలో దూకరాదు.
- చెరువుల్లోకి ఈతకు వెళ్లే ముందు అక్కడ గుంతల లోతు, పూడిక, నాచు గురించి తెలుసుకోవాలి.
- నీటిలో మునిగిన వ్యక్తులను ఒడ్డుకు చేర్చి, నీరు తాగి ఉంటే బయటకు కక్కించాలి.
- ఊపిరితిత్తుల్లో నీరు చేరిందా, లేదా గమనించాలి.
- ఊపిరితిత్తుల్లో శ్వాసలేదంటే ఛాతిపై చేతితో రుద్దాలి.
- ప్రమాదానికి గురైన వ్యక్తికి ప్రథమ చికిత్స చేస్తూనే 108కు సమాచారం అందించాలి.
- నీటి వనరుల వద్ద అధికారులు ప్రమాద హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేయాలి



సముద్రపు ఉప్పుకాలువ వద్ద ఉన్న తెప్పలు

వైసీపీ నేతల వర్గపోరు

- తీరంలో రాజకీయ కాలుష్యం

చిట్రగుంట, ఏప్రిల్ 9: సముద్రం ఎంత ప్రశాంతంగా ఉంటుందో.. అంతే ప్రశాంతంగా మత్స్యకారులు (గంగపుత్రులు) కూడా ఉంటారు. కడలిలో అలజడి రేగితే ఎంత అల్లకల్లోలంగా ఉంటుందో.. మత్స్యకారుల పరిస్థితి కూడా అదే. కొన్నేళ్లుగా ప్రశాంతంగా ఉంటున్న తీరంలో ఇటీవల రాజకీయ విభేదాలు ప్రారంభమయ్యాయి.

● నేతల రంగప్రవేశంతో...

బోగోలు మండల తీరంలోకి రాజకీయ నేతల రంగప్రవేశంతో గందరగోళం నెలకొంది. ఇటీవల వైసీపీలో వర్గవిభేదాలు తలెత్తి దాడులకు దారితీశాయి. ఏకగ్రీవమైన సీఆర్‌పాలెం పంచాయతీలో వర్గపోరుతో పరస్పర దాడులకు దిగి కుటుంబాలు విడిపోయే పరిస్థితి నెలకొంది. ఆప్కాప్ చైర్మన్ కొండూరు అనిల్‌బాబు తీరంలో తన పట్టు బిగుంచుకునే ప్రయత్నంలో కొందరిని రెచ్చకొట్టి సీఆర్ పాలెం సర్పంచు గిరిబాబు పని తీరును ఎత్తిచూపారు. కాగా కావలి ఏఎంసీ మాజీ చైర్మన్ మన్నెమాల సుకుమార్‌రెడ్డితో సర్పంచు చేతులు కలిపి అధిక మొత్తంలో నగదు తీసుకుని గ్రామాభివృద్ధి చేయడం లేదని మరికొందరు ఆరోపించారు.

● నిన్న తాటిచెట్లపాలెంలో...

రెండు నెలల క్రితం తాటిచెట్లపాలెంలో జరిగిన సమావేశానికి అనిల్‌బాబును రానివ్వకుండా గ్రామ పెద్దలు అడ్డుకున్నారు. ఎన్నికలు అయ్యాక గ్రామాన్ని ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి పట్టించుకోలేదని గ్రామ కాపులు మండిపడ్డారు. రాజ్యసభ సభ్యుడు బీదమస్తాన్‌రావు చొరవ తీసుకుని గ్రామస్థులకు సర్దిచెప్పడంతో వివాదం సద్దుమణిగింది. అనంతరం గ్రామంలో కాపుల అనుమతితో గడప గడపకు మన ప్రభుత్వ కార్యక్రమాన్ని రోడ్‌షోకి పరిమితం చేశారు. తీర ప్రాంతంలో కట్టుబాటు ప్రకారం గ్రామంలో వ్యతిరేకపనులకు పాల్పడితే పెద్దలు, కాపుల నిర్ణయం మేరకు జరిమానా విధించి గ్రామ బహిష్కరణ చేస్తారు. ప్రస్తుతం సీఆర్‌పాలెం పంచాయతీ పరిధిలోని పాతపాలెంలో అటువంటి పరిస్థితి ఏర్పడిన కారణంగానే వైసీపీలో ఇరువర్గాల మధ్య దాడి జరిగిందని గ్రామస్థులు పేర్కొన్నారు. ఇప్పటికైనా తీరప్రాంత గ్రామాల్లో రాసుకుంటున్న రాజకీయ కక్షలను ఆపితే మత్స్యకారులు ప్రశాంతంగా ఉంటారు.

రూ. 2.70 లక్షల నగదు, 319 మద్యం సీసాల స్వాధీనం

- కొనసాగుతున్న పోలీసు తనిఖీలు

నెల్లూరు(క్రైం), ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ ఆదేశాల మేరకు జిల్లాలోకి ప్రవేశించే అన్ని మార్గాల్లోనూ చెక్‌పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ పోలీసులు నిరంతరం వాహనాలను తనిఖీలు చేస్తున్నారు. ఇందులో భాగంగా మంగళవారం రూ.2.70 లక్షల నగదు, 319 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నట్లు జిల్లా పోలీసు కార్యాలయం ఓ ప్రకటనలో పేర్కొంది. తగిన రశీదులు లేకుండా బుచ్చి పోలీసు స్టేషన్ పరిధిలో అక్రమంగా తరలిస్తున్న రూ.2.70 లక్షల నగదును పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వేదాయపాలెం పోలీసు స్టేషన్ పరిధిలో 15, కొడవలూరులో 36, కావలి వన్‌టౌన్ లో 20, కావలి రూరల్‌లో 20, జలదంకిలో 12, చేజర్లలో 22, మర్రిపాడులో 15, కలువాయిలో 34, సైదాపురంలో 10, వలేటివారిపాలెం స్టేషన్ పరిధిలో 12 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. సెబ్ అధికారులు జిల్లా వ్యాప్తంగా చేపట్టిన తనిఖీల్లో 123 మద్యం సీసాలను స్వాధీనం చేసుకున్నారు.

20 మద్యం సీసాలు..

కావలి, ఏప్రిల్ 9: కావలి పట్టణంలో అక్రమంగా తరలిస్తున్న 20 మద్యం సీసాలను మంగళవారం మధ్యాహ్నం పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. కావలి ఒకటో పట్టణ సీఐ రాజేష్ తెలిపిన వివరాల మేరకు.. స్థానిక ఎస్‌బీఐ సమీపంలో ఓ వ్యక్తిని అనుమానంతో అదుపులోకి తీసుకుని తనిఖీ చేయగా ఆయన వద్ద 20 మద్యం సీసాలు ఉండగా స్వాధీనం చేసుకుని కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

చికెన్ ధరలు

నెల్లూరు పౌల్ట్రీ అసోసియేషన్

	కిలో
బాయిలర్ లైవ్	163
లేయర్ లైవ్	95
స్కిన్ చికెన్	284
స్కిన్‌లెస్	314
లేయర్	162

బంగారం, వెండి ధరలు

బంగారం (22 క్యారెట్లు)

ఒక గ్రాము ధర	రూ. 6834
వెండి కిలో ధర	రూ. 85,200
వెండి ఒక గ్రాము	రూ. 87.20

చుక్కనీరు లేని చెరువులు..

చేతికందని పైర్లు

- ఎండుతున్న వరితో రైతుల గగ్గోలు
- పట్టించుకోని పాలకులు



నీరు లేక ఎండిన సిరిపురం చెరువు



ఆముదాలదిన్నెలో చెరువు గుంతల నుంచి కిలోమీటర్ దూరంలోని పొలాలకు పైపులు నడుపుతున్న రైతులు

కావలి రూరల్, ఏప్రిల్ 9 : 'కావలి నియోజకవర్గంలో ఎక్కడా కూడా ఎకరాపైరు ఎండకుండా సాగునీరు అందించిన ఘనత వైసీపీ ప్రభుత్వ మదే'.. అని విలేకరుల సమావేశంపెట్టి మరీమరీ చెప్పారు ఆ పార్టీ ఎమ్మెల్యే రామిరెడ్డి ప్రతాప్‌కుమార్‌రెడ్డి. అయితే కావలికి కూతవేటు దూరంలోని సిరిపురం చెరువుకింద ఎండిపోతున్న పంటలు మాత్రం ఆయనకు కనపడినట్లు లేదు. అడుగంటిన చెరువులతో ఎండుతున్న వరిపైర్లు కావలి మండలంలోని పలు గ్రామాల్లో దర్శనమిస్తున్నాయి.

● పట్టించుకోని పాలకులు

రైతులు ఆరుగాలం కష్టించి కంటికి రెప్పలా చూసుకున్న వరిపైరు నిలువునా ఎండుతున్నా పాలకులు పట్టించుకోవటం లేదని రైతులు గగ్గోలు పెడుతున్నారు. వర్షాధారంగా మండలంలో 6,792 ఎకరాల్లో వరిపైరు సాగుచేశారు. పైరు గింజపట్టే దశకు చేరటంతో చెరువుల్లో నీరు అడుగంటింది, దీంతో రైతులు తీవ్ర ఒత్తిడికి లోనై ఎకరాకు రూ.2,000 ఖర్చు చేసి ఇంజన్లతో చెరువుల్లోని గుంతల్లో నీటిని కిలో మీటర్ల తీసుకెళ్లి పైర్లను రక్షించుకుంటున్నారు. ఇప్పటికే 70 శాతం పంట కోతలు పూర్తికాగా, మిగిలిన 30 శాతం పైరు సాగునీరు లేక ఎండిపోతున్నది. మండలంలోని సిరిపురం, ఆముదాలదిన్నె, ఆనెమడుగు, సర్వాయపాలెం గ్రామాల్లో పలుచోట్ల పంటలు ఎండిపోవటంతో రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మండలంలోని చివరి ఆయకట్టుకు నీరు అందిస్తాం... ఒక్క ఎకరా కూడా ఎండి పోనీయం.. అని గ్రామగ్రామాన రైతులకు చెప్పిన ఎమ్మెల్యే ప్రతాప్‌కుమార్‌రెడ్డి తమ గోడు పట్టించుకోలేదని రైతులు వాపోతున్నారు. అంతేకాక నేతల తీరు పట్ల వారు ఆగ్రహం వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా పాలకులు స్పందించి సోమశిల నీటితో చెరువులు నింపాలని రైతులు కోరుతున్నారు.



ఆముదాలదిన్నెలో ఎండిన వరిపైరు

ఆర్టీసీ కార్గో.. అంతుచిక్కని రవాణా !

- యథేచ్ఛగా నిషేధిత వస్తువుల తరలింపు
- సహకరిస్తున్న సిబ్బంది
- సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఏమి వస్తున్నాయో.. ఏమి వెళ్తున్నాయో తెలియని వైనం
- బుక్ చేసిన వారి వివరాలు తీసుకోవడంలో నిర్వాహకుల విఫలం

నెల్లూరు(స్టోన్‌హౌస్‌పేట), ఏప్రిల్ 9: సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో అక్రమ రవాణాను అరికట్టేందుకు జిల్లా యంత్రాంగం పటిష్టమైన చర్యలు చేపడుతోంది. ఈ క్రమంలో పోలీసుశాఖ అధ్వర్యంలో జిల్లావ్యాప్తంగా ప్రత్యేక చెక్ పోస్టులను ఏర్పాటు చేశారు. అక్కడ నిరంతరం వాహనాలను అధికారులు క్షుణ్ణంగా తనిఖీ చేస్తున్నారు. అక్రమంగా నగదు, మద్యం, నాటు సారా, గంజాయి తరలించకుండా కఠిన చర్యలు తీసుకుంటున్నారు. ఈ క్రమంలో ఆర్టీసీ కార్గో ద్వారా అక్రమ రవాణా అధికంగా జరిగే అవకాశం ఉందని గతంలో జరిగిన పలు సంఘటనలు రుజువు చేస్తున్నాయి. ఈ క్రమంలో పోలీసులు కార్గోపై ప్రత్యేక దృష్టి సారించాలని పలువురు కోరుతున్నారు.

● గత సంఘటనలు పరిశీలిస్తే...

గతంలో ఆర్టీసీ కార్గోపై విజిలెన్స్, సెబ్ అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. ఈ క్రమంలో ఇతర రాష్ట్రాల నుంచి జిల్లాకు వస్తున్న మద్యం, గుట్కాలు, ఇతర నిషేధిత వస్తువులను స్వాధీనం చేసుకున్నారు. సంబంధిత డ్రైవర్లు, కండక్టర్లపై కేసులు కూడా నమోదు చేశారు. తాజాగా ఈనెల 6న హైదరాబాద్ నుంచి జంగారెడ్డి గూడెంకు వస్తున్న ఆర్టీసీ కార్గో వాహనంలో అట్టపెట్టెల్లో ఉన్న నోట్ల కట్టలను పోలీసు, రెవెన్యూ అధికారులు పట్టుకున్నారు. అక్కడ దొరికిన రూ.22,59,500ను సీజ్ చేసి ట్రెజరీకి తరలించారు. సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో జిల్లాలోని కార్గో సర్వీసుల ద్వారా ఏమి వస్తున్నాయో..ఏమేమి వెళుతున్నాయో.. చూసుకోవాల్సిన బాధ్యత నిర్వాహకులపై ఉంది.

● అధికంగా మద్యం, గుట్కాల రవాణా

రాష్ట్ర ప్రభుత్వం కొత్త మద్యం పాలసీ ప్రవేశపెట్టినప్పుడు ఇతర రాష్ట్రాల మద్యానికి బాగా డిమాండ్ ఏర్పడింది. ఈ క్రమంలో పాత బ్రాండ్లు, తక్కువ ధరకే దొరికే మద్యాన్ని ఇతర రాష్ట్రాల నుంచి ఆర్టీసీ కార్గో ద్వారా జిల్లాకు తరలించేవారు.



ఆర్టీసీ బస్టాండ్ ప్రాంగణంలోని కార్గో కార్యాలయం



బుకింగ్ చేసుకున్న పార్శిళ్లు

దీన్ని కొందరు లారీ డ్రైవర్లు, ఆర్టీసీ డ్రైవర్లు ఉపాధిగా మార్చుకున్నారు. లారీల్లో మద్యం దిగుమతి చేస్తుండగా పలుమార్లు సెబ్, స్థానిక అధికారులు పట్టుకున్నారు. దీంతో వారు ఆర్టీసీ కార్గో సేవలను వినియోగించుకోసాగారు. డెకరేషన్ సామగ్రి, దుస్తులు, ఎలక్ట్రానిక్, ఎలక్ట్రికల్ వస్తువులు, స్టీలు, ప్లాస్టిక్ సామాన్ల పేరుతో నిషేధిత వస్తువులైన గుట్కా, మద్యం, బంగారు ఆభరణాలను జిల్లాకు దిగుమతి చేసుకుంటున్నారు. అయితే గుట్కాల నిషేధం రాష్ట్రంలో లేకపోవడంతో ఆర్టీసీ కార్గోలో తనిఖీలు చేయడం తగ్గింది. అయితే ఎన్నికల వేళ మరింతగా కార్గోలో తనిఖీలు చేయాల్సిన అవసరం ఉంది.

● తనిఖీలు అంతంత మాత్రమే

ఆర్టీసీ కార్గోను ప్రవేశపెట్టిన తర్వాత సంస్థకు ఆదాయం పెరుగుతూ వస్తున్నది. ఈ క్రమంలో అసలు ఎవరు ఏ వస్తువులను డెలివరీ చేస్తున్నారు, ఇతర ప్రాంతాల నుంచి ఏయే వస్తువులు జిల్లాకు వస్తున్నాయి, వస్తువును బుక్ చేసేవారి ఆధార్ వివరాలు తీసుకోవడం.. తదితర విషయాలపై ఆర్టీసీ అధికారులు దృష్టి సారించడం లేదు. ఏ పార్శిల్ ఇచ్చినా నేరుగా బరువు వేసి బుక్ చేసేస్తున్నారు. మండేటి, పేలేటి వస్తువులు, ఇతర రాష్ట్రాల మద్యం, గంజాయి, మత్తు పదార్థాలు.. ఇలా ఏ పార్శిల్‌ను ఇచ్చినా కార్గో ద్వారా రవాణా చేస్తున్నారని కొందరు ఆర్టీసీ సిబ్బందే తెలియచేస్తున్నారు.

తనిఖీలు ముమ్మరం

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో ఆర్టీసీ కార్గోపై ప్రత్యేక దృష్టి సారించాం. పార్శిళ్లు బుక్ చేసుకునే సమయంలో ఆర్టీసీ, విజిలెన్స్ అధికారులు సంయుక్తంగా తనిఖీలు చేస్తున్నారు. అనుమానం ఉన్న పార్శిళ్ల బాక్స్‌లను ఓపెన్ చేయించి పరిశీలిస్తున్నారు. నిషేధిత వస్తువులు, నగదు, మద్యం తదితరాలను తరలిస్తే చర్యలు తప్పవని హెచ్చరికలు జారీ చేస్తున్నాం.


\- పీవీ శేషయ్య, రోడ్డు రవాణా సంస్థ జిల్లా అధికారి

ఐపీఎల్ తరహాలో ఎన్పీఎల్ టోర్నీ

- మే 18 నుంచి నిర్వహణకు సన్నాహాలు

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 9 : జిల్లా క్రికెట్ అసోసియేషన్ పర్యవేక్షణలో ఐపీఎల్ తరహాలో నెల్లూరులో ఎన్పీఎల్‌కు నిర్వహణకు భారీగా సన్నాహాలు చేస్తున్నట్లు అసోసియేషన్ కేర్ టేకర్ డి.శ్రీనివాసులరెడ్డి తెలిపారు. నగరంలోని జిల్లా క్రికెట్ అసోసియేషన్ క్రీడా ప్రాంగణంలో ఆయన విలేకరులతో మాట్లాడుతూ మోపూరు సుందరరామయ్య (ఎంఎస్‌ఆర్) నెల్లూరు ప్రీమియమ్ లీగ్ పేరుతో ఈ పోటీలు మే 18న ప్రారంభిస్తామన్నారు. దీనికోసంగా 8 ప్రాంఛైజీలు ఒక్కొక్కరు 20 మంది క్రీడాకారులను వేలంలో కొనుగోలు చేస్తారన్నారు. ఒక్కో ప్రాంఛైజీ రూ.50వేలలోపు మాత్రమే వెచ్చించి క్రీడాకారులను కొనుగోలు చేయాలని షరతులు విధించామన్నారు. నెల్లూరు, గూడూరు, కావలి, ఆత్మకూరు, సూళ్లూరుపేట, నెల్లూరు రూరల్, బుచ్చిరెడ్డిపాళెం, కోట-వాకాడులకు చెందిన ప్రాంఛైజీలు వేలంలో పోటీ పడతాయన్నారు. ఆసక్తి, ప్రతిభ కలిగిన క్రీడాకారులు తమ పేర్లను ఈ నెల 30వతేదీ లోపల నమోదు చేసుకుంటే వారి వివరాలను పరిశీలించి ఆక్షన్‌కు అనుమతిస్తామన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ 8050623562, 9908992749 నెంబర్లను సంప్రదించాలని తెలిపారు. అనంతరం ఎన్పీఎల్‌కు సంబంధించిన పోస్టర్లను ఆవిష్కరించారు. ఈ సమావేశంలో గూడూరు రూరల్ క్రికెట్ క్లబ్ వ్యవస్థాపకుడు షషాంక్ జక్కంరెడ్డి, సిబ్బంది పాల్గొన్నారు.

సోమశిలలో 8.933 టీఎంసీల నిల్వ



అనంతసాగరం, ఏప్రిల్ 9 : సోమశిల జలాశయంలో నీటిమట్టం పడిపోతోంది. డ్యాం పూర్తిసామర్థ్యం 77.988 టీఎంసీలు కాగా మంగళవారం నాటికి ప్రాజెక్టులో 8.933 టీఎంసీల నీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు. దిగువ ఉత్తర కాలువకు 50, డెల్టాకు 500, దక్షిణ కాలువకు 50 క్యూసెక్కుల నీటిని సరఫరా చేస్తున్నారు.

ఎన్నికల నియమావళిని అతిక్రమిస్తే చర్యలు : ఎస్పీ

సంగం, ఏప్రిల్ 9: ఎన్నికల నియమావళిని అతిక్రమించినా, ఎన్నికల ప్రక్రియకు ఆటంకం కలిగించినా, ఓటర్లను ప్రలోభపెట్టినా చట్టపరమైన చర్యలు తీసుకుంటామని జిల్లా ఎస్పీ కే ఆరీఫ్ హఫీజ్ తెలిపారు. మంగళవారం సాయంత్రం ఆయన స్థానిక పోలీస్‌స్టేషన్‌ను ఆకస్మికంగా తనిఖీ చేశారు. ఈ సందర్భంగా ఆయన పోలీస్‌స్టేషన్ పరిధులు, భౌగోళిక స్థితిగతులు, క్రిటికల్ పోలింగ్ స్టేషన్లను అడిగి తెలుసుకున్నారు. శాంతి భద్రతలకు భంగం వాటిల్లితే వెంటనే ఆ ప్రదేశానికి చేరుకునేలా పోలీస్ అధికారులు, సిబ్బంది సంసిద్ధంగా ఉండాలని ఆదేశించారు. సమస్యాత్మకక గ్రామాలను పోలీసు అధికారులు తరచూ సందర్శిస్తూ అక్కడ ఉన్న సమస్యలను, పరిస్థితులను ఎప్పటికప్పుడు పర్యవేక్షించాలన్నారు. పెండింగ్‌లో ఉన్న అరెస్ట్ వారెంట్‌లను వెంటనే పరిష్కరించాలన్నారు. చెక్‌పోస్ట్‌ల వద్ద 24 గంటలూ వాహనాల తనిఖీ చేయాలన్నారు. ఎన్నికల కోడ్ అమలులో ఉన్న నేపథ్యంలో ప్రజలు ఇతర ప్రాంతాలకు వెళ్లేటప్పుడు రూ. 50 వేలకు మించి నగదు, ఎక్కువ నగలు తీసుకెళ్లవద్దని కోరారు. ఒకవేళ అవసరాల రీత్యా తీసుకువెళుతుంటే తగిన ధారాలు, ధ్రువీకరణ పత్రాలు అధికారులకు చూపించాలన్నారు. ఎవరైనా ఎన్నికల నియమావళిని అతిక్రమినట్లు సమాచారం తెలిస్తే సీ విజిల్ యాప్ ద్వారా, లేదా టోల్ ఫ్రీ నెంబరు 112కు కాల్ చేసి సమాచారం అందించాలన్నారు. ఆయన వెంట సీఐ రవినాయిక్, ఎస్‌ఐ నాగార్జునరెడ్డి, పోలీసులు తదితరులు ఉన్నారు.



సంగం పోలీస్‌స్టేషన్‌లో మండల మ్యాప్ పరిశీలిస్తున్న ఎస్పీ ఆరీఫ్ హాఫీజ్

ఆత్మకూరులో వైసీపీకి భారీ షాక్

- టీడీపీలో చేరిన ఎంపీపీ కేతా వేణుగోపాల్ రెడ్డి



టీడీపీ తీర్థం పుచ్చుకున్న ఆత్మకూరు ఎంపీపీ కేతా వేణుగోపాల్‌రెడ్డి, రావులుకొల్లు మాజీ సర్పంచి మోహన్‌రెడ్డి

ఆత్మకూరు, ఏప్రిల్ 9 : ఆత్మకూరులో వైసీపీకి భారీ షాక్ తగిలింది. ప్రజాదరణ కలిగిన ఆత్మకూరు మండలాధ్యక్షుడు కేతా వేణు గోపాల్‌రెడ్డి, రావులకొల్లు మాజీ సర్పంచి రామిరెడ్డి మోహన్‌రెడ్డి వైసీపీని వీడి మంగళవారం టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. ఎన్‌డీఏ కూటమి నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, ఆత్మకూరు అసెంబ్లీ అభ్యర్థి ఆనం రామనారాయణరెడ్డి ఆధ్వర్యంలో వారు టీడీపీలో చేరారు. ఈ క్రమంలో వారికి వీపీఆర్, ఆనం రామనారాయణరెడ్డి పార్టీ కండువా కప్పి సాదరంగా టీడీపీ లోకి ఆహ్వానించారు. అనంతరం వారు మాట్లాడుతూ పార్టీలో చేరిన వారికి తగిన ప్రాధాన్యత ఉంటుందని, టీడీపీ గెలుపు కోసం కష్టపడి పని చేయాలని కోరారు. ఇదే క్రమంలో మరికొందరు ఆత్మకూరు మున్సిపల్ కౌన్సిలర్లు, ఎంపీటీసీ సభ్యులు, సర్పంచులు, వైసీపీ నాయకులు, కేతా వేణుగోపాల్‌రెడ్డి అనుచరులు టీడీపీలోకి చేరనున్నట్లు విశ్వసనీయ సమాచారం. దీంతో ఆత్మకూరు మండలంలో వైసీపీకి భారీ షాక్ తగిలి నట్లయింది. ఆత్మకూరు రూరల్‌లో బలంగా ఉన్న టీడీపీకి వీరి చేరికతో మరింత బలం చేకూరింది.



పురస్కారాలు అందుకున్న ప్రతిభావంతులు

ప్రతిభ పురస్కారాల ప్రదానం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 : ఉగాది పర్వదినం సందర్భంగా వివిధ రంగాలలో ప్రతిభావంతులకు నగరంలోని జేసీభవన్‌లో మంగళవారం ప్రతిభా పురస్కారాలు అందజేశారు. జేసీ (అల్లుమిని) నెల్లూరు టౌన్ జేసీఐ ఎంజల్స్ జీవన ప్రయోగశాల ఆరోగ్య సేవా ట్రస్ట్ సంయుక్తంగా దీనిని నిర్వహించాయి. విద్య, వైద్యం, సామాజిక క్రీడలు, జానపద నృత్యం, గానం, నాదస్వరం, జర్నలిజం తదితర రంగాలలో ప్రతిభావంతులకు పురస్కారాలు అందజేశారు. బ్రేక్ ఇన్ స్పెక్టర్ కే మురళీమోహన్, డాక్టర్ శ్రీవాత్సవ కుమార్, వీఎస్‌యూ ఎగ్జామ్స్ కంట్రోలర్ ఆర్ మధుమతి, జేఏసీ చైర్మన్ చలువాది శరణ్‌కుమార్, నేషనల్ డైరెక్టర్ జేపీసీ కోట సత్యం, మెంటా రమణ్, తదితరులు పాల్గొన్నారు.

సింహవాహనంపై సంగమేశ్వరుడి గ్రామోత్సవం



సింహ వాహనంపై ఊరేగుతున్న సంగమేశ్వరుడు

సంగం, ఏప్రిల్ 9: స్థానిక సంగమేశ్వరాలయంలో జరుగుతున్న బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం అర్ధరాత్రి సింహవాహనంపై సంగమేశ్వరస్వామి భక్తులకు దర్శనమిచ్చారు. ఈ సందర్భంగా శ్రీ కామాక్షీదేవి సంగమేశ్వరస్వామి ఉత్సవ విగ్రహాలను సింహవాహనంపై ఉంచి గజపూల మాలలతో అలంకరించారు. అనంతరం సంగం పుర వీధుల్లో ఊరేగించారు. ఈ కార్యక్రమానికి బలిజసంఘం వారు ఉభయకర్తలుగా వ్యవహరించారు. స్వామి, అమ్మవారికి పూలంగిసేవ ఏర్పాటు చేశారు. ఆలయ అర్చకులు గోపాలకృష్ణమూర్తి భక్తులకు తీర్థప్రసాదాలు అందజేశారు. ఆలయంలో రాత్రి రామాంజనేయ యుద్ధం, చింతామణి భవాని సీను, సాంస్కృతిక నాటక ప్రదర్శన జరిగింది. కార్యక్రమాలను ఆలయ ట్రస్ట్‌బోర్డు చైర్మన్ రవీంద్రబాబు పర్యవేక్షించారు. ఈ సందర్భంగా ఎటువంటి అవాంఛనీయ సంఘటనలు జరగకుండా సంగం పోలీసులు బందోబస్తు ఏర్పాటు చేశారు.

భక్తిశ్రద్ధలతో వీరభద్రస్వామి హోమం

మంగళవారం ఉదయం వీరభద్రస్వామి ఆలయంలో పద్మశాలి సంఘం తరుపున వీరభద్రస్వామి హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. ఈ పూజా కార్యక్రమంలో మాజీ దేవస్థానం కమిటీ చైర్మన్ మాఘం గిరిబాబు దంపతులు పాల్గొన్నారు.

వాడవాడలా ఉగాది వేడుకలు

భక్తులతో కిటకిటలాడిన ఆలయాలు

ఆత్మకూరు, ఏప్రిల్ 9 : ఉగాది వేడుకలు మంగళవారం వాడవాడలా ఘనంగా నిర్వహించారు. పట్టణంలోని శ్రీ వెంకటేశ్వర స్వామి ఆలయం, అలఘునాథస్వామి, అభయాంజనేయస్వామి, కన్యకాపరమేశ్వరి, శివాలయాలలో, తిరునాళ్ళతిప్పలోని కాశీనాయన ఆశ్రమం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. వెంకటేశ్వరస్వామి ఆలయంలో మాజీ జడ్పీచైర్మన్, ఆలయ ధర్మకర్త బొమ్మిరెడ్డి రాఘవేంద్రరెడ్డి ఆధ్వర్యంలో స్వామివారికి ప్రత్యేక పూజలు జరిగాయి. అంకమ్మమాను వద్ద ఉగాది సంబరాలు ఘనంగా జరిగాయి. ఈ కార్యక్రమంలో భక్తులు పాల్గొన్నారు.



ఉదయగిరి రూరల్ : గండిపాళెం సిద్ధేశ్వరాలయంలో ప్రత్యేక పూజల్లో పాల్గొన్న భక్తులు

ఆపస్ ఆధ్వర్యంలో

ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు నిర్వహించారు. మున్సిపల్ బస్టాండ్ సెంటర్‌లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఆత్మకూరు, అనంతసాగరం, ఏఎస్ పేట, మర్రిపాడు మండలాలకు చెం దిన ఆపస్ నాయకులు పాల్గొన్నారు.



ఆత్మకూరు: ఉగాది పచ్చడి పంపిణీ చేస్తున్న అపస్ నాయకులు

షిరిడీసాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో..

పట్టణంలోని ఆర్టీసీ డిపో ఎదురుగా ఉన్న శ్రీ షిరిడీసాయి పిరమిడ్ ధ్యానకేంద్రంలో ధ్యానసాధకులు, పిరమిడ్ మాష్టర్లు ఉగాది వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఉగాది పచ్చడి, అల్పాహారం ఏర్పాటు చేశారు. అనంతరం ఆత్మజ్ఞాన శిక్షణ తరగతులు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీనియర్ పిరమిడ్ మాస్టర్ డాక్టర్ చంద్రా సుబ్రహ్మణ్యం పలువురు పిరమిడ్‌మాస్టర్లు, ధ్యానసాధకులు పాల్గొన్నారు.

నాగారపమ్మకు చందనాలంకారం

సంగం: ఉగాది పండుగను పురస్కరించుకుని మండలంలోని కోలగట్ల పెన్నానది ఒడ్డున ఉన్న నాగారపమ్మ ఆలయంలో అమ్మవారికి చందనాలంకరణ చేశారు. అనంతరం ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో భక్తులు అధికసంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలు స్వీకరించారు.

ఆపస్ ఆధ్వర్యంలో ఉగాది పచ్చడి పంపిణీ

ఉగాది పండుగను పురస్కరించుకుని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంఘం (ఆపస్) ఆధ్వర్యంలో మంగళవారం బస్టాండ్, సత్రం, రాళ్లచెలిక, చౌడేశ్వరి దేవి ఆలయం తదితర ప్రాంతాల్లో ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆపస్ ఉపాధ్యాయులు ప్రభాకర్, వెంకటేశ్వర్లు, సురేష్ పాల్గొన్నారు.

కిటకిటలాడిన ఆలయాలు

ఉదయగిరి రూరల్: ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం మండలంలోని గండిపాళెం జలాశయం వద్ద ఉన్న సిద్ధేశ్వరాలయంతోపాటు ఉదయగిరి పట్టణంలోని పార్వతీపరమేశ్వరాలయం, దు త్తలూరు మండలం వెంకటంపేట ఆంజ నేయస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈసందర్భంగా ఉ గాది పచ్చడిని స్వీకరించారు.

ఉదయగిరి: ఉగాది పర్వదినం సందర్భంగా పట్టణంలోని రంగనాయకుల స్వామి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు. మండలంలోని గండిపాళెం, కుర్రపల్లి, బిజ్జంపల్లి, అప్పసముద్రం, కొండాయపాళెం తదితర గ్రామాల్లో ఆలయాల్లో పూజలు నిర్వహించి పంచాగశ్రవణం వినిపించారు. పచ్చడిని పంపిణీ చేశారు. అన్నదాన కార్యక్రమాలు ఏర్పాటు చేశారు.

వెంగమాంబ కల్యాణోత్సవం

దుత్తలూరు(ఉదయగిరి రూరల్) : ఉగాది పర్వదినాన్ని పురస్కరించుకొని నర్రవాడ శ్రీవెంగమాంబ పేరంటాలమ్మ, గురవయ్యనాయుడుల కల్యాణోత్సవాన్ని ఆలయ సన్నిధిలో మంగళవారం వేదపండితులు వైభవంగా నిర్వహించారు. ఈసందర్భంగా అమ్మవారికి ఆలయ కార్యనిర్వాహణాధికారి ఉషశ్రీ పట్టువస్త్రాలు సమర్పించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని కల్యాణోత్సవాన్ని తిలకించారు. అనంతరం స్వామివార్లకు పల్లకిసేవ నిర్వహించారు. ఆలయ ఉప ప్రధానార్చకులు పెదభద్రయ్య పంచాంగ శ్రవణం చేశారు. ఈ కార్యక్రమంలో అర్చకులు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

గంగమ్మ తల్లికి ప్రత్యేక పూజలు

వింజమూరు: పట్టణంలోని గంగమెట్టలో వున్న గంగాభవానీ అమ్మవారికి ఉగాది సందర్భంగా యాదవ బజారుకు చెందిన యువత ఆధ్వర్యంలో ఘనంగా ఉత్సవం నిర్వహించారు. అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు అమ్మవారిని దర్శించుకుని తీర్థప్రసాదాలను స్వీకరించారు. ఈ కార్యక్రమానికి ఆలయ కమిటీ పర్యవేక్షణించారు.

ఘనంగా లక్ష్మీనరసింహస్వామి కల్యాణం

కలువాయి : ఉగాది పర్వదినం పురస్కరించుకుని శ్రీ లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో మంగళవారం సాయంత్రం శ్రీవారి కల్యాణం వైభవంగా నిర్వహించారు. ఉభకర్తలుగా కామిశెట్టి వెంకటేశ్వర్లు దంపతులు వ్యవహరించారు. ఆలయ వ్యవస్థాపకులు నరసయ్యస్వామి పాల్గొన్నారు.

విద్యార్థులకు భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు

ఉగాది పర్వదినం పురస్కరించుకుని కలువాయి హిందూ ధర్మ పరిరక్షణ సమితి, సమరసత సేవా ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక శివసాయి కళాశాలలో విద్యార్థులకు మండల స్థాయి భగవద్గీత శ్లోక కంఠస్థ పోటీలు నిర్వహించారు. మండల విద్యాశాఖా అధికారులు బాలకృష్ణారెడ్డి, శేషగిరిరావు, నరసింహారావు, ప్రసాదు, రాఘవరెడ్డి, వాసవి క్లబ్ సభ్యులు పాల్గొన్నారు.

చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రాభివృద్ధి

● ఉదయగిరి టీడీపీ ఉమ్మడి అభ్యర్థి కాకర్ల

వింజమూరు, ఏప్రిల్ 9: చంద్రబాబునాయుడు ముఖ్యమంత్రి అయితేనే రాష్ట్రం అభివృద్ధి చెందుతుందని ఉదయగిరి ఉమ్మడి ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్ అన్నారు. మండలంలోని నల్లగొండ్ల గ్రామానికి చెందిన సుమారు 100 కుటుంబాలు వైసీపీ నాయకులు అన్నపురెడ్డి మురళీధర్‌రెడ్డి, అంకినపల్లి ఓబుల్‌రెడ్డి ఆధ్వర్యంలో కాకర్ల సురేష్ సమక్షంలో టీడీపీ తీర్థం పుచ్చుకున్నారు. వారందరికీ పార్టీ కండువా కప్పి సాదరంగా ఆహ్వానించారు. పల్లెపల్లెకు కాకర్ల కార్యక్రమంలో భాగంగా మండలంలోని నల్లగొండ గ్రామంలో కాకర్ల సురేష్ ఇంటింటికీ తిరిగి సైకిల్ గుర్తుకు ఓటువేసి గెలిపించాలని అభ్యర్థించారు. ముందుగా అభయాంజనేయస్వామి, నల్లగొండపై వేంచేసి వున్న శ్రీదేవి భూదేవి సమేత లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో పూజలు నిర్వహించారు.

● గుండెమడకలలో 'పల్లెపల్లెకు కాకర్ల'

గుండెమడకల గ్రామంలో పల్లెపల్లెకు కాకర్ల కార్యక్రమానికి ప్రజలు ఘన స్వాగతం పలికారు. ఇంటింటికి తిరిగి టీడీపీని భారీ మెజారిటీతో గెలిపించాలని అభ్యర్థించారు. చంద్రబాబునాయుడును ముఖ్యమంత్రిని చేయాలని, ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్యే కంభం విజయరామిరెడ్డి, మండల కన్వీనర్ గొంగటి రఘునాథరెడ్డి, మాజీ కన్వీనర్ గూడా నరసారెడ్డి, కార్యనిర్వాహక కార్యదర్శి చల్లా వెంకటేశ్వర్లుయాదవ్, టీడీపీ, జనసేన, బీజేపీ నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, తదితరులు పాల్గొన్నారు.



టీడీపీలో చేరిన వారితో కాకర్ల సురేష్

టీడీపీ ఆధ్వర్యంలో ఇఫ్తార్ విందు

పట్టణంలో ముస్లింలకు తెలుగుదేశం పార్టీ ఆధ్వర్యంలో రంజాన్ మాసం సందర్భంగా ఉదయగిరి నియోజకవర్గం టీడీపీ అభ్యర్థి కాకర్ల సురేష్ ముస్లిం సోదరులకు ఇఫ్తార్ విందు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముస్లింలకు తెలుగుదేశం పార్టీ రంజాన్ మాసంలో కానుకలు ఇచ్చిందని, వైసీపీ ప్రభుత్వం వాటిని తుంగలో తొక్కిందని తెలిపారు. ఈ కార్యక్రమంలో మండల మైనారిటీ సెల్ అధ్యక్షులు మహబూబ్‌బాషా, షరీఫ్, అబ్దుల్‌నబీ, ముస్లిం పెద్దలు పాల్గొన్నారు.

అభయాంజనేయస్వామికి ప్రత్యేక పూజలు



ప్రత్యేక అలంకారంలో అభయాంజనేయస్వామి

ఆత్మకూరు, ఏప్రిల్ 9: పట్టణంలోని హనుమాన్ జంక్షన్‌లోని అభయాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం ప్రత్యేక పూజలు నిర్వహించారు. స్వామివారికి పంచామృతాభిషేకం, సహస్రనామార్చన, ఆకుపూజ గావించి హనుమాన్ చాలీసా పఠించారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని ఏర్పాటు చేశారు.

పోలీసు కవాతు

సీతారామపురం, ఏప్రిల్ 9: ఎన్నికలలో ఓటర్లు స్వేచ్ఛగా ఓటు హక్కు వినియోగించుకోవాలని ఎస్ఐ అనూష సూచించారు. మండలంలోని గ్రామాలలో మంగళవారం ఉదయగిరి సీఐ గిరిబాబు ఆధ్వర్యంలో ఎస్ఐ అనూష పారా మిలటరీ, పోలీసులతో కవాతు నిర్వ హించారు.

34 మద్యం సీసాల స్వాధీనం

కలువాయి, ఏప్రిల్ 9: దాచూరు సమీపంలో మంగళవారం రాత్రి 34 మద్యం సీసాలను పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. ముగ్గురు వ్యక్తులు కలసి మద్యం తీసుకెళుతుండగా పోలీసులు తనిఖీలు నిర్వహించి పట్టుకున్నట్లు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్ఐ అయ్యప్ప తెలిపారు.

ఆనకట్ట వద్ద బస్సుల నిలుపుదల



ఆనకట్ట వద్ద బస్సు ఎక్కుతున్న ప్రయాణికులు

సంగం, ఏప్రిల్ 9: సంగమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాలకు ఆటంకం లేకుండా సంగం - పొదలకూరు రూట్‌లో తిరిగే ఆర్టీసీ బస్సులను మంగళవారం నుంచి ఆనకట్ట వద్దనే నిలుపుదల చేస్తున్నారు. బ్రహ్మోత్సవాల సందర్భంగా ఆలయం ముందు అంగళ్లు ఏర్పాటు చేయడంతో బస్సులు తిప్పుకునేందుకు ఇబ్బందిగా మారింది. దీంతో ఆనకట్ట వద్ద బస్సులు నిలుపుదల చేస్తున్నారు. ప్రయాణికులు సహకరించాలని ఆర్టీసీ సిబ్బంది కోరారు.

వైసీపీ నుంచి పలువురు టీడీపీలో చేరిక

సంగం, ఏప్రిల్ 9: మండలంలోని అన్నారెడ్డి పాళెం మజరా పల్లిపాళెం గ్రామానికి చెందిన పలువురు వైసీపీ కుటుంబాలు ఆ పార్టీని వీడి మంగళవారం ఆనం రామనారాయణరెడ్డి సమక్షంలో ఆయన ఇంటికి వెళ్లి టీడీపీలో చేరారు. పార్టీలో చేరిన తాండ్ర పెంచలయ్య, మనపాక సుబ్బయ్య, కిన్నెలపూడి పెంచలయ్య, మనపాక, పెంచలయ్య, మనపాక ప్రకాష్, తాండ్ర బుజ్జయ్య తదితరులకు ఆనం టీడీపీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. ఈ కార్యక్రమంలో హరిరెడ్డి, హజరత్‌రెడ్డి, కృష్ణారెడ్డి తదితరులు పాల్గొన్నారు.



పార్టీలో చేరిన వారితో ఆనం రామనారాయణరెడ్డి

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుకే సాధ్యం : బొల్లినేని

ఉదయగిరి రూరల్, ఏప్రిల్ 9: ఐదేళ్ల వైసీపీ పాలనలో సర్వ నాశన మైన రాష్ట్రం టీడీపీ అధినేత చంద్రబాబు ముఖ్యమంత్రి అయితేనే అన్ని రంగాల్లో అభివృద్ధి చెందుతుందని మాజీ ఎమ్మెల్యే బొల్లినేని వెంకట రామారావు అన్నారు. మంగళ వారం పట్టణంలోని చిన్న మసీదులో ఏర్పా టుచేసిన ఇఫ్తార్ విందులో ఆయన పాల్గొని ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేశారు. అలాగే బసినేనిపల్లి, సీతారామపురం గ్రామాల్లోనూ ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. తొలుత స్థానిక చెంచురామయ్య అతిథిగృహంలో బొల్లినేని విలేకరులతో మాట్లాడుతూ ఇటీవల వింజమూరుకు వచ్చిన చంద్రబాబును తాను కలిసి నియోజకవర్గ సమస్యలపై ప్రస్తా వించినట్లు చెప్పారు. ప్రాజెక్టులన్నీ పూర్తయితే 2.6 లక్షల ఎకరాలు సాగులోకి రావడంతోపాటు తాగునీటి కష్టాలు తీరుతాయని చంద్రబాబు దృష్టికి తీసుకెళ్లానన్నారు. దీంతో చంద్రబాబు స్పందించి అధి కారంలోకి రాగానే ఆ సమస్య కూడా తీరుస్తానని హామీ ఇచ్చినట్లు తెలిపారు. తాను టీడీపీని వీడే ప్రసక్తే లేదన్నారు. ఆయన వెంట టీడీపీ నాయకులు బయ్యన్న, రియాజ్, బొజ్జా నరసింహులు, నల్లిపోగు రాజా, నరసింహా, ఓబులరెడ్డి తదితరులు ఉన్నారు.



ముస్లింలతో కలిసి ప్రార్థనలు చేస్తున్న బొల్లినేని

అధిక ధరకు మద్యం విక్రయాలు

మర్రిపాడు, ఏప్రిల్ 9: ప్రభుత్వ మద్యం షాపుల్లో మద్యం దొరక్క మందుబాబులు అల్లాడుతున్నారు. మధ్యాహ్నం 3గంటలకే షాపులు మూత వేస్తుండటంతో పనులకు వెళ్లి వచ్చిన వారు బ్లాక్‌లో అమ్ముతున్న వారిని ఆశ్రయించక తప్పటం లేదు. ఎన్నికల కమిషనర్ ఉత్తర్వులు అంటూ గత ఏడాది జరిగిన అమ్మకాలను బట్టి రోజూవారి టార్గెట్ ప్రకారం ఒక్కో షాపులో ఒక్కో రకంగా అమ్మకాలు చేయాలంటూ అధికారులు నిర్ణయించారు. ఇది అక్రమ వ్యాపారులకు అదునుగా మారింది. మండలంలో ఉన్న నాలుగు ప్రభుత్వ షాపుల్లో మద్యం మధ్యాహ్నంకే టార్గెట్ ముగుస్తుంది. ఎక్కువ మద్యం బయట బ్లాక్ మార్కెట్‌కు తరలి వెళ్తుంది. బ్లాక్‌లో ప్రతీ సీసాకు రూ. 50నుండి రూ. 100 వరకు అదనంగా పెట్టి మందుబాబులు కొనుగోలు చేయాల్సి వస్తోంది. దీంతో ఇటీవల బ్లాక్‌లో అమ్మేవారు అధిమయ్యారు. బెల్టు షాపులు కాకుండా ఎక్కడో ఒక ప్రయివేట్ స్థావరాల్లో పెట్టుకొని మందుకోసం ఫోన్ చేస్తే, బైకుల్లో వచ్చి సీసా ఇచ్చి డబ్బులు తీసుకెళ్లే విధంగా జరుగుతోంది. రోజూ కూలి చేసుకొస్తే వచ్చే కూలి డబ్బులకు అదనంగా ఖర్చు చేసి మద్యం కొనాలంటే భారంగా ఉందంటూ మందుబాబులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా జిల్లా అధికారులు స్పందించి అధిక ధరకు మద్యం విక్రయాలను అరికట్టాలని మందు బాబులు కోరుతున్నారు.

రాష్ట్రాభివృద్ధి చంద్రబాబుతోనే సాధ్యం

● కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి

ఉలవపాడు, ఏప్రిల్ 9 : రాష్ట్రాభివృద్ధి టీడీపీ అధినేత చంద్రబాబు నాయుడుతోనే సాధ్యమని టీడీపీ, జనసేన, బీజేపీ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని బద్ది పూడిలో కందుకూరు కూటమి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావుతో కలసి ఆయన ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వేమిరెడ్డి మాట్లాడుతూ ఐదేళ్ల వైసీపీ పాలనతో విసిగిపోయిన ఆపార్టీ నాయకులు, కార్యకర్తలు చంద్రబాబుపై నమ్మకంతో వైసీపీని వీడి టీడీపీలో చేరేందుకు ఉత్సాహం చూపుతున్నారన్నారు. టీడీపీ కూటమి అధికారంలోకి రావడం తథ్యమని రాష్ట్ర ప్రజలు నిశ్చయానికి వచ్చారన్నారు. ఎంపీగా తనను, ఎమ్మెల్యేగా ఇంటూరిని గెలిపించాలని కోరారు. దోచుకోవడం దాచుకోవడం తప్ప ప్రజాసేవ తెలియని వ్యక్తి వైసీపీ ఎంపీ అభ్యర్థి విజయసాయి రెడ్డి అని, అనునిత్యం ప్రజాసేవకే జీవితం అంకితం చేసిన కుటుంబం టీడీపీ కూటమి ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిదని, ఈ ఇద్దరికి పోలికే లేదని ఇంటూరి నాగేశ్వరరావు పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఉలవపాడు, కొల్లూరుపాడు ఎస్సీ కాలనీల వాసులు, లింగసముద్రం మండల వైసీపీ మాజీ ఎంపీపీ పూరిమిట్ల బాలకోటయ్య, బద్ధిపూడిలో కూనం బ్రహ్మానందరెడ్డి ఆధ్వర్యంలో 70 వైసీపీ కుటుంబాలు, కరేడు చెంచురామిరెడ్డి తదితరులు టీడీపీలో చేరారు. వారికి వేమిరెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానిం చారు. ఈ కార్యక్రమంలో టీడీపీ శ్రేణులు పాల్గొన్నారు.



ఉలవపాడు : టీడీపీలో చేరిన వారితో వేమిరెడ్డి, ఇంటూరి

కందుకూరులో ఉత్సాహంగా..

కందుకూరు : ఒంగోలు విజయ డెయిరీ మాజీ చైర్మన్ చల్లా శ్రీనివాస రావు స్వగ్రామమైన ఓగూరులో మంగళవారం రాత్రి టీడీపీ ఎన్నికల ప్రచారం అట్టహాసంగా సాగింది. చల్లా శ్రీనివాసరావు నేతృత్వంలో ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, అసెంబ్లీ అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు లకు ఘన స్వాగతం పలికారు. అనంతరం ర్యాలీగా బయలుదేరి పెద్ద ఓగూరు, చిన్న ఓగూరు, ఎస్టీ కాలనీ, ఎస్సీ కాలనీ, ఆది ఆంధ్రకాలనీలలో రోడ్ షో ద్వారా వేమిరెడ్డి, ఇంటూరిలు ప్రచారం చేశారు. ఈ సందర్భంగా పలువురు వైసీపీ నాయకులు టీడీపీలో చేరారు. వైసీపీ ఎంపీటీసీ అల్లం రాధయ్య, మోరం రమేష్ ఆధ్వర్యంలో కొన్ని కుటుంబాలు టీడీపీలో చేరాయి. ఓగూరులో జరిగిన కార్యక్రమంలో లింగసముద్రం మండలం వీఆర్ కోటకు చెందిన చిమ్మిలి మాల కొండయ్య టీడీపీలో చేరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు నాయకులు నార్నె రోశయ్య, దామా మల్లేశ్వరరావు, పచ్చవ తిరుపతిస్వామి, అల్లం వెంకటేశ్వర్లు, రాయపాటి శ్రీనివాసరావు, అంగ్రా వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు. అంతకుముందు కందుకూరు గ్రామదేవత అంకమ్మ అమ్మవారిని వేమిరెడ్డి, ఇంటూరి దర్శనం చేసుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఆలయ కమిటీసభ్యులు, పలువురు నేతలు వారికి సాదర స్వాగతం పలికారు.



కందుకూరు : ఓగూరులో వేమిరెడ్డి, ఇంటూరిలకు గజమాలతో స్వాగతం పలుకుతున్న టీడీపీ శ్రేణులు

టీడీపీలో పలువురు వైసీపీ నేతల చేరిక

కావలి, ఏప్రిల్ 9: వైసీపీని వీడి పలువురు నేతలు మంగళవారం ముసునూరు టీడీపీ కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారికి టీడీపీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలను కప్పి సాదరంగా ఆహ్వానించారు. పట్టణంలోని 36వ వార్డుకు చెందిన వైసీపీ బూత్ కన్వీనర్ తాతా వెంకటేశ్వర్లు ఆధ్వర్యంలో నులుగురు వలంటీర్లతోపాటు తాతా బాలక్రిష్ణ, తాతా చందు,తాతా ప్రవీణ్, చుండ్రు ఆనంద్, తాటిబోయిన పెంచలయ్య, అజయ్, మౌనిక టీడీపీలో చేరారు. బోగోలు మండలం విశ్వనాథరావుపేటకు చెందిన అడపా ప్రసాద్, జొన్నలగడ్డ కోటేశ్వరరావులు తన అనుచరులతో మండల కన్వీనర్ మాలేపాటి నాగేశ్వరరావు, రాష్ట్ర కార్యదర్శి పమిడి రవికుమార్ చౌదరి సమక్షంలో టీడీపీలో చేరారు. వారికి కావ్య క్రిష్ణారెడ్డి పార్టీ కండువాలు వేసి ఆహ్వానించారు.



వైసీపీ నేతలను టీడీపీలోకి ఆహ్వానిస్తున్న కావ్య

పలువురికి పరామర్శ : ఆరోగ్యం సరిగాలేక చికిత్స పొందుతున్న పలువురు టీడీపీ కుటుంబ సభ్యులను కావ్య క్రిష్ణారెడ్డి పరామర్శించారు. పట్టణంలోని 19వ వార్డుకు చెందిన మాజీ కౌన్సిలర్ మస్తాన్ సతీమణి జెరీనా, దావులూరి నరసమ్మలు వేర్వేరు ఆసుపత్రిలలో చికిత్స పొందుతుండగా కావ్య పరామర్శించారు. 40వ వార్డు ఆచారవీధిలో పిచ్చికుక్క దాడికి గాయపడిన ఇంతియాజ్-ఆసీఫా, వంశీ-దుర్గల కుటుంబాలను ఇళ్లకు వెళ్లి పరామర్శించారు.

● లంబాడిడొంక వాసులు...

కందుకూరు : పట్టణంలోని 30వ వార్డు లంబాడిడొంకకు చెందిన పలు కుటుంబాల వారు మంగళవారం నియోజకవర్గ టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మ డి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వర రావు సతీమణి సౌజన్య సమ క్షంలో తెలుగుదేశం పార్టీలో చే రారు. వారికి ఆమె టీడీపీ కం డువాలు కప్పి పార్టీలోకి ఆహ్వా నించారు. పార్టీలో చేరిన వారిలో అల్లూరి హరిబాబు, కొత్తపల్లి జగన్మోహనాచారి, భారతీదేవి, జొన్నాదుల విజయలక్ష్మి, సోడా సుజాత, పరుచూరి హరిణి, శివనాగపార్వతి, బచ్చు ఉదయ్, హేమంత్‌కిషోర్, బాణా ల వేణు, నాగమణి, పతకమూరి విజయలక్ష్మి, అరివేముల సుభాషిణి తదితర కుటుంబాల వారు ఉన్నారు. ఈ కార్యక్రమంలో పార్టీ నాయకులు దామా మల్లేశ్వర రావు, ముచ్చు శ్రీను, పులి నాగరాజు, భైరపునేని రమణయ్య పాల్గొన్నారు. కాగా క్రోధి నామసంవత్సర ఉగాది పర్వదినం సందర్భంగా టీడీపీ, జనసేన, బీజేపీల ఉమ్మడి అభ్యర్థి ఇంటూరి నాగేశ్వరరావు దంపతులు మంగళవారం పట్టణంలోని కోవూరు రోడ్డులో ఉన్న సాయిబాబా ఆలయం, ఆంజనేయస్వామి ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

కావలి జేబీపీ అభ్యర్థిగా మైనంపాటి యేసురత్నం

కావలిటౌన్, ఏప్రిల్ 9: జై భీమ్‌రావ్ భారత్ పార్టీ కావలి అభ్యర్థిగా మైనంపాటి యేసు రత్నం పోటీ చేయనున్నట్లు మంగళవారం అంబేద్కర్ నగర్‌లోని తన కార్యాలయంలో జరిగిన విలేకర్ల సమావేశంలో ప్రకటించారు. తన ట్రస్ట్ ద్వారా అందిస్తున్న సేవా కార్యక్రమాలను గుర్తించిన జై భీమ్‌రావ్ భారత్ పార్టీ వ్యవస్థాపక అధ్యక్షుడు హైకోర్టు విశ్రాంత న్యాయమూర్తి జడ శ్రావణ్‌కుమార్ తనకు ఎన్నికల్లో పోటీ చేసే అవకాశం కల్పించారన్నారు. సమావేశంలో టౌన్ ఇన్‌చార్జ్ పురుషోత్తమ్, దగదర్తి ఇన్‌చార్జ్ సుందరం, తదితరులు పాల్గొన్నారు.

పోలేరమ్మకు పొంగళ్లు

బిట్రగుంట, ఏప్రిల్ 9: బోగోలు మండలం చెంచులక్ష్మీ పురంలో వెలసి ఉన్న పోలేరమ్మకు ఉగాది పర్వదినం సందర్భంగా మంగళవారం అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. పీఎస్ఆర్ ట్రస్ట్ అధినేత్రి పసుపులేటి సుగుణమ్మ తన ఇంటి వద్ద నుంచి చద్ది నైవేద్యాన్ని మేళతాలాలతో తీసుకుని వచ్చి అమ్మవారికి సమర్పించారు. ఆలయ ప్రాంగణంలో భక్తులకు చద్దితో పాటు ఉగాది పచ్చడిని అందచేశారు. ఆమె వెంట ట్రస్ట్ సభ్యులు, స్థానికులు తదితరులు ఉన్నారు.



చద్ది తీసుకొస్తున్న పసుపులేటి సుగుణమ్మ

టీడీపీ గెలిస్తేనే రాష్ట్రాభివృద్ధి : మాలేపాటి

దగదర్తి(బిట్రగుంట), ఏప్రిల్ 9: తెలుగుదేశం పార్టీ గెలిస్తేనే రాష్ట్రం అన్ని విధాల అభివృద్ధి జరుగుతుందని వైసీపీ వస్తే శ్రీలంకలా మారుతుందని కావలి నియోజకవర్గ నేత మాలేపాటిసుబ్బానాయుడు అన్నారు. దగదర్తి మండలం ఊచగంటపాలెం పంచాయతీలో మంగళవారం ఆయన ఇంటింటి ప్రచారం నిర్వహించారు. చంద్రబాబునాయుడు ప్రవేశ పెట్టిన పథకాల కరపత్రాలను పంపిణీ చేశారు. టీడీపీ అధికారంలోకి రావలంటే టీడీపీ నెల్లూరు ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, కావలి అసెంబ్లీ అభ్యర్థి కావ్య క్రిష్ణారెడ్డిని గెలిపించుకోవాలని ఆయన కోరారు.



గ్రామస్థులతో మాట్లాడుతున్న మాలేపాటి

జాబు కావాలంటే బాబు రావాల్సిందే..!

కలిగిరి, ఏప్రిల్ 9: జాబు కావాలంటే బాబు రావాల్సిందేనని, తమ ఓటు తెలుగుదేశం పార్టీకి వేసి చంద్రబాబునాయుడిని ముఖ్యమంత్రిని చేసుకుంటామని తొలిసారి ఓటు హక్కు పొందిన యువత పేర్కొన్నారు. కలిగిరి పంచాయతీ జిర్రావారి పాలెంలో మంగళవారం టీడీపీ, జనసేన, బీజేపీల నాయకులు ఇంటింటికి తిరిగి ప్రచారం నిర్వహించారు. పూర్తి స్థాయిలో అభివృద్ధి జరగాలంటే ఎంపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డికి, ఎమ్మెల్యే అభ్యర్థి కాకర్ల సురేష్‌కి ఓటువేసి గెలిపించాలని కోరారు. ఈ కార్యక్రమంలో టీడీపీ మండల కన్వీనర్ బిజ్జం కృష్ణారెడ్డి, కొప్పోలు కొండలరావు, జిర్రా పెద్ద అంకిరెడ్డి, వాకా మాల్యాద్రి తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం నిర్వహిస్తున్న టీడీపీ, మిత్రపక్షాలు

నేడు వేమిరెడ్డి, కాకర్ల ప్రచారం

ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకరరెడ్డి, కాకర్ల సురేష్‌లు బుధవారం కలిగిరి పట్టణంలో ఎన్నికల ప్రచారం నిర్వహిస్తారని, ఈ కార్యక్రమంలో టీడీపీ, జనసేన, బీజేపీ శ్రేణులు పెద్ద సంఖ్యలో పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని టీడీపీ మండల కన్వీనర్ కోరారు.

ఘనంగా ఉగాది వేడుకలు

కందుకూరు, ఏప్రిల్ 9: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పర్వదినాన్ని మంగళవారం ప్రజలు ఆనందోత్సాహాల మధ్య ఘనంగా జరుపుకున్నారు. పొంగళ్లు పెట్టుకుని ఉగాది పచ్చడి సేవించటంతో పాటు ప్రత్యేక పూజలు నిర్వహించారు. కందుకూరు పట్టణంతో పాటు వివిధ గ్రామాల్లోని ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో వచ్చి ప్రత్యేక పూజలు నిర్వహించటంతో నూతన శోభను సంతరించుకుంది. పట్టణంలోని వాసవీక్లబ్ లెజెండ్స్, వాసవీ వనితా క్లబ్, శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీల ఆధ్వర్యంలో ఊరిబయట గుడారాల్లో నివశించే నిరుపేద కుటుంబాల్లోని చిన్నారులకు నూతన వస్త్రాలు అందజేసి అన్నప్రసాద వితరణ చేశారు. ఆయా కార్యక్రమాల్లో శ్రీరామ సాయిబాబా వెల్ఫేర్ సొసైటీ ప్రతినిధులు పాకల రంగారావు, నల్లమల్లి ప్రసాదు, పబ్బిశెట్టి వెంకటేశ్వరప్రసాదు, శశిధర్, స్థానికులు చక్కా కేశవ, రవ్వా శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరు : క్రోధి నామ ఉగాదిని పురస్కరించుకొని నార్తు మోపూరులోని శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వరదరాజస్వామి ఆలయంలో బలిజ సంఘం ఆధ్వర్యంలో గరుడ వాహనసేవ నిర్వహించారు. స్వామివారిని గరుడ వాహనంపై అలంకరించి గ్రామంలో ఊరేగించారు.



అల్లూరు : గరుడవాహనంపై ఊరేగుతున్న వరదరాజస్వామి

లింగసముద్రం : స్థానిక టీడీపీ నూతన కార్యాలయంలో క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలు మండల తెలుగు యువత అధ్యక్షుడు అడపా రంగయ్య, గ్రామ పార్టీ అధ్యక్షుడు గాలంకి ప్రసాద్‌ల ఆధ్వర్యంలో జరిగాయి. కార్యాలయంలో వేంకటేశ్వరస్వామి, లక్ష్మీదేవి, వినాయకస్వామిల చిత్రపటాలకు ప్రత్యేక పూజలు చేశారు. ఈ కార్యక్రమంలో టీడీపీ నాయకులు వంకాయలపాటి మాల్యాద్రి, జంపాల కృష్ణయ్య, అడపా నరసయ్య, మైల రామకేశవులు, జంపాల శివప్రసాద్, ఏ చినసత్యం, జనసేన నాయకులు కొణిదెల శ్రీనివాసులు తదితరులు పాల్గొన్నారు. అలాగే స్థానిక అయ్యప్పస్వామి ఆలయంలో భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. మండలంలోని పెంట్రాల, మొగిలిచెర్ల, పెదపవని, చినపవని, వీఆర్ కోట, తిమ్మారెడ్డిపాలెం ఆలయాల్లో పూజలు చేశారు.

కలిగిరి : మండల ప్రజలు క్రోధి నామ సంవత్సర ఉగాది వేడుకలను ఘనంగా జరుపుకున్నారు. ఇంటిల్లిపాది దేవాలయాలను సందర్శించి పూజా కార్యక్రమాలు నిర్వహించారు. ఆలయాల్లో పంచాగ శ్రవణం జరిగింది. భక్తులకు ఉగాది పచ్చడిని పంచిపెట్టారు.

బిట్రగుంట : బోగోలు మండలం విశ్వనాథరావుపేట పంచాయతీ రామస్వామిపాలెంలో వెలసి ఉన్న కోదండ రామాలయంలో ఉగాది పండుగ సందర్భంగా స్వామి అమ్మవార్లకు ప్రత్యేక పూజాభిషేకాలు జరిగాయి. లేళ్లపల్లి వెంకట కిషోర్ స్వామి ఆధ్వర్యంలో ఆలయ ప్రాంగణంలోని పోలేరమ్మ చెట్టు వద్ద చద్ది కార్యక్రమం జరిగింది. దాసరి కోటయ్య, కోటమ్మల జ్ఞాపకార్థం ఎద్దల మోహన్‌రావు మైయిక్‌సెట్, జైశ్రీరామ్ అలారం బాక్స్‌ను ఎల్.పెద్ద వెంకటరమణయ్య కుటుంబం అందజేసింది.

పేదలకు దుస్తుల పంపిణీ

కావలి, ఏప్రిల్ 9 : కావలి ఒకటో పట్టణ ఎస్ఐ జమాల్‌వలి తన సతీమణి హబిబున్నీసా జ్ఞాపకార్థంగా రంజాన్‌మాసాన్ని పురస్కరించుకుని మంగళవారం పేదలకు దుస్తులు పంపిణీ చేశారు. స్థానిక ఇందిరానగర్‌లోని ఎస్ఐ నివాసంలో హ్యాపీ సేవాసంస్థ ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో వన్‌టౌన్ సీఐ రాజేష్ పాల్గొని పేదలకు దుస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో హ్యాపీ సేవాసంస్థ అధ్యక్షుడు సయ్యద్ ఘనీబాషా, సేవాసంస్థ బాధ్యులు చేవూరి ప్రభయ్య, షేక్ జమీర్, సయ్యద్ నౌషాద్ అలీ, తదితరులు పాల్గొన్నారు.

అల్లూరులో ప్రచారం

అల్లూరు, ఏప్రిల్ 9 : రిపబ్లిక్ పార్టీ ఆఫ్ ఇండియా అంబేడ్కర్ రిస్ట్ కావలి నియోజకవర్గ అభ్యర్థి ఎల్లు సాల్మన్‌రాజు మంగళవారం అల్లూరు పట్టణ పరిధిలోని ఉడ్‌హౌస్‌పేట, చింతగుంట, చాకిరేవుగుంట, రాయపేట ప్రాంతాల్లో ప్రచారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో కోవూరు బాబు, కప్పల నవీన్ కుమార్, నక్కా గిరి సుబ్రహ్మణ్యం, కాకాని రంగయ్య, తదితరులు పాల్గొన్నారు.

మసీదుల్లో టీడీపీ నేతల ప్రార్థనలు

అల్లూరు, ఏప్రిల్ 9 : టీడీపీ నెల్లూరు పార్లమెంటు ఉపాధ్యక్షుడు బీద గిరిధర్, వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి సహోదరుడు వేమిరెడ్డి కోటారెడ్డిలు అల్లూరు జామియా మసీదు, బీసీ కాలనీలోని మసీదు, నార్తుమోపూరులోని మసీదుల్లో మంగళవారం జరిగిన ఇఫ్తార్ విందుల్లో పాల్గొన్నారు. ముస్లింలతో కలసి ప్రార్థనలు చేశారు. అనంతరం వారిని సత్కరించారు. ఈ కార్యక్రమంలో రఫీమాలిక్, ఊటు శ్రీకాంత్‌రెడ్డి, మేడా కృష్ణారెడ్డి, నీలపరెడ్డి హరీష్ రెడ్డి, రేబాల శంకర్‌రెడ్డి, నజీర్‌బాషా పాల్గొన్నారు.



ప్రార్థనలు చేస్తున్న వేమిరెడ్డి కోటారెడ్డి, గిరిధర్

ఆలయాల్లో ఉగాది శోభ

కోవూరు, ఏప్రిల్ 9: క్రోధి నామ ఉగాది పర్వదినాన్ని మంగళవారం మండల ప్రజలు ఆనందోత్సాహాల నడుమ జరుపుకున్నారు. పట్టణంలోని పురాతన శివాలయం, గ్రామ దేవత నాగవరప్పమ్మ ఆలయం, గమళ్లపాలెంలోని మహాలక్ష్మమ్మ ఆలయం, పడుగుపాడులోని చింతాలమ్మ ఆలయం, మోడేగుంటలోని నాగేశ్వర స్వామి ఆలయం, ఇనమడుగులోని భావనారుషి ఆలయాలకు భక్తులు పెద్దసంఖ్యలో తరలివచ్చి పూజలు చేశారు. దీంతో ఆలయాల్లో ఉగాది శోభ సంతరించుకుంది.

బుచ్చిరెడ్డిపాళెం : మండలంలోని జొన్నవాడ మల్లికార్జునస్వామి, కామాక్షితాయి ఆలయం, రేబాల, దామరమడుగు, పెనుబల్లి, పంచేడు, రెడ్డిపాళెం, కాగులపాడు, బుచ్చిలోని కోదండరామ స్వామి, కల్యాణ వేంకటేశ్వరుడు, బాబా మందిరం, దుర్గమ్మ, కన్యకాపరమేశ్వరి ఆలయాలలో మంగళవారం ఉగాది వేడుకలు జరిగాయి. ఆలయాలు సుందరంగా ముస్తాబయ్యాయి. జొన్నవాడలో ఉదయం స్వామివారికి అభిషేకం, అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులు స్వామి, అమ్మవార్లను దర్శించుకుని తీర్థప్రసాదములు స్వీకరించారు. రేబాల గ్రామ దేవత పుట్టాలమ్మకు రాత్రి గ్రామోత్సవం నిర్వహించారు. జొన్నవాడలో కొలువైవున్న శ్రీదేవి, భూదేవి సమేత శ్రీవరదరాజస్వామి గరుడవాహనంపై ఊరేగుతూ భక్తులకు దర్శనమిచ్చారు.

విడవలూరు : మండలంలోని విడవలూరు, ఊటుకూరు, ముదివర్తి, అన్నారెడ్డిపాలెం, పార్లపల్లి వావిళ్ల, దండిగుంట గ్రామాల్లో ఉగాది వేడుకలను ప్రజలకు ఘనంగా జరుపుకున్నారు. గ్రామ దేవతలకు భక్తులు ప్రత్యేక పూజలు చేశారు. కుంకుమార్చనలు, అభిషేకాలు, పొంగళ్లు సమరించి భక్తులకు అన్నదానం చేశారు.

సైదాపురం: మండలంలో ఉగాది వేడుకలు మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సైదాపురం, చాగణం, కలిచేడు గ్రామాల్లో సాయిబాబా మందిరాల్లో విశేష పూజా కార్యక్రమాలు నిర్వహించారు. కృష్ణారెడ్డిపల్లి వైకుంఠపురం మహావిష్ణువు ఆల యం, సైదాపురంలోని బాల త్రిపుర సుందరీ దేవి ఆలయం, సిద్దేశ్వర కోన, కలిచేడులో పోలేరమ్మకు పూజలు నిర్వహించారు.



బుచ్చిరెడ్డిపాళెం : రేబాలలో ప్రత్యేక అలంకరణలో పుట్టాలమ్మ

ప్రశాంతిరెడ్డిని కలిసిన టీడీపీ నాయకులు

విడవలూరు, ఏప్రిల్ 9: కోవూరు ఉమ్మడి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డిని మండలానికి చెందిన టీడీపీ నాయ కులు బెజవాడ వంశీకృష్ణారెడ్డి, ఎస్‌కె. రఫీ, ఉచ్చూరు సుధీప్‌రెడ్డి, వేగూరు చంద్రా రెడ్డి, పూండ్ల ఏసోబులు మంగళవారం నెల్లూరులో కలసి ఉగాది శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా ప్రశాంతి రెడ్డి మాట్లాడుతూ గ్రామ నాయకు లకు, కార్యకర్తలకు అండగా ఉంటానన్నారు.



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని కలిసిన టీడీపీ నేత వంశీకృష్ణారెడ్డి

దిగజారుడు రాజకీయాలు మానుకోవాలి

కోవూరు, ఏప్రిల్ 9: ఎమ్మెల్యే నల్లపరెడ్డి ప్రసన్న కుమార్‌రెడ్డి, ఆయన సోదరుడు రాజేంద్రకుమార్‌రెడ్డి దిగ జారుడు రాజకీయాలు మానుకోవాలని దివంగత నల్లపరెడ్డి శ్రీనివాసులురెడ్డి సోదరుడు నల్లపరెడ్డి సుబ్బారెడ్డి కుమారుడు సురేష్‌రెడ్డి హితవు పలికారు. రైల్వే రోడ్డులోని టీడీపీ కార్యాలయంలో మంగళవారం ఆయన విలేకరుల సమావేశంలో ఆయన మాట్లాడుతూ నల్లపరెడ్డి సోదరులు నెల్లూ రులో విజయసాయిరెడ్డితో కలసి కోవూరు టీడీపీ అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి ఫోన్ ఆడియో అంటూ దిగజారుడు రాజకీయానికి పాల్పడ్డారని ఇనమడుగులో జరిగిన ప్రశాం తిరెడ్డి ప్రచార కార్యక్రమంలో పలువురు నల్లపరెడ్డి కుటుం బాన్ని హీనంగా మాట్లాడారన్నారు. దీనిని విని బాధతో తాను మాట్లాడుతున్నానని, నల్లపరెడ్డి కుటుంబ పరువును బజారుకీడ్చడం ఎమ్మెల్యే ప్రసన్న, ఆయన సోదరుతు రాజేంద్రలకు తగదన్నారు. బ్లాక్‌మెయిల్ రాజకీయాలు మానుకోవాలన్నారు. టీడీపీ పార్లమెంటు అభ్యర్థి వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి కుటుంబం 75 ఏళ్ల నుంచే మైకా గనుల వ్యా పారంలో ఉందన్నారు. వాస్తవాన్ని మరచి నల్లపరెడ్డి సోద రులు మాట్లాడటం తగదన్నారు.



మాట్లాడుతున్న నల్లపరెడ్డి సురేష్‌రెడ్డి

భారీ మెజారిటీతో విజయం తథ్యం : సోమిరెడ్డి

పొదలకూరు, ఏప్రిల్ 9 : రాబోయే ఎన్నికల్లో భారీ మెజారిటీతో విజయం తథ్యమని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి ధీమా వ్యక్తం చేశారు. మండలంలోని పార్లపల్లి గ్రామానికి చెందిన 14 కుటుంబాలు గ్రామ సర్పంచ్ గూడూరు ప్రసన్న ఆధ్వర్యంలో మంగళవారం నెల్లూరులోని వేదాయపాలెంలో సోమిరెడ్డి కార్యాలయంలో టీడీపీలో చేరారు. వారిని పార్టీ కండువా కప్పి సోమిరెడ్డి సాదరంగా ఆహ్వానించారు. వైసీపీని వీడి టీడీపీలో చేరిన వారిలో షేక్ మస్తాన్‌సాహెబ్, సయ్యద్ మస్తాన్, నీలి వెంకటరమణయ్య, నీలి హరికృష్ణ ఉన్నారు.



సోమిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన నాయకులు

బీసీల ద్రోహి కాకాణి : సోమిరెడ్డి

తోటపల్లిగూడూరు: మంత్రి కాకాణి గోవర్ధనరెడ్డి బీసీల ద్రోహి అని మాజీ మంత్రి సోమిరెడ్డి చంద్రమోహన్‌రెడ్డి విమర్శించారు. మంగళవారం వేదాయపాలెంలోని సోమిరెడ్డి కార్యాలయంలో వీరబోయిన గంగాధర్, ఆవుల మునిరత్నం ఆధ్వర్యంలో 12 మత్స్యకార కుటుంబాలు వైసీపీని వీడి టీడీపీలో చేరారు. సోమిరెడ్డి వారికి పార్టీ కండువాలు కప్పి స్వాగతం పలికారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వెంకటేశ్వర పట్టపుపాలెంలో ఎప్పటి నుంచో గ్రామ కంఠంగా ఉన్న భూమిని ఫారెస్టు భూమిగా చిత్రీకరించి బీసీలు సాగు చేసుకుంటున్న రొయ్యల గుంటలను రెండోసారి గెలిచిన కాకాణి నెలకే విధ్వంసం సృష్టించి రూ.కోట్లలో నష్టానికి గురిచేశాడని, అనేక అక్రమ కేసులు బనాయించారని తెలిపారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర కార్యదర్శి బొమ్మి సురేంద్ర, కావల్‌రెడ్డి శ్యాంసుందర్ రెడ్డి, మత్స్యకార నాయకులు, తదితరులు పాల్గొన్నారు.

వైసీపీ నుంచి భారీగా టీడీపీలో చేరిక

బుచ్చిరెడ్డిపాళెం, ఏప్రిల్ 9: బుచ్చిరెడ్డిపాళెంలో వైసీపీ నుంచి టీడీపీలోకి భారీగా వలసలు మొదలయ్యాయి. తెలుగు సంవత్సరం ఉగాది పర్వదినం రోజున మంగళవారం టీడీపీ మండల కన్వీనర్ ఎంవీ.శేషయ్య, సూరా శ్రీనివాసులురెడ్డి, టీడీపీ రాష్ట్ర ఎస్టీ సెల్ కార్యదర్శి చలంచర్ల సునీల్ నేతృత్వంలో కోవూరు ఎన్డీఏ కూటమి ఎమ్మెల్యే అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో పెద్ద సంఖ్యలో వైసీపీ నాయకులు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. బుచ్చి నగర పంచాయతీ పరిధిలోని రామచంద్రాపురంకు చెందిన సీనియర్ వైసీపీ నేతతోపాటు వందమందికిపైగా కార్యకర్తలకు ప్రశాంతిరెడ్డి పార్టీ కండువాలు కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. ఎమ్మెల్యే ప్రసన్నకుమార్ రెడ్డి అరాచకాలు సహించలేకే టీడీపీలో చేరినట్లు వైసీపీ మాజీ నాయకులు పేర్కొన్నారు. అవినీతి అక్రమాలకు అలవాటుపడిన ప్రసన్న అభివృద్ధి మాట మరిచి మాఫియాలకు డాన్‌గా వ్యవహరిస్తున్నారన్నారు. నెల్లూరు ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని, కోవూరు ఎమ్మెల్యేగా వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డిని గెలిపించుకుంటామని భరోసా ఇచ్చారు.



వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి సమక్షంలో టీడీపీలో చేరిన వైసీపీ నాయకులు

భక్తిశ్రద్ధలతో మృత్యుంజయ హోమం



మృత్యుంజయ హోమంలో భక్తులు

పొదలకూరు, ఏప్రిల్ 9 : మండలంలోని ఇనుకుర్తి గ్రామంలో ఉగాదిని పురస్కరించుకుని శ్రీకాంతమ్మ తల్లి ఆలయ ప్రాంగణంలోని శివాలయంలో మృత్యుంజయ హోమం భక్తిశ్రద్ధలతో నిర్వహించారు. అనంతరం అన్నదాన కార్యక్రమం ఏర్పాటు చేశారు. ఈ కార్యక్రమానికి ఉభయకర్తలుగా పులిమి నరేంద్ర, మోహనలత వ్యవహరించారు. తొలుత అభిషేకం, పూలంగి సేవ, కాంతమ్మతల్లి, వినాయక, శివపార్వతులు, నందీశ్వరుడు, వీరభద్రస్వామి, నాగమ్మతల్లికి నూతన పట్టువస్త్రాలు సమర్పించారు. అనంతరం హోమం నిర్వహించారు.

ఏడుగురు పేకాటరాయుళ్ల అరెస్ట్

పొదలకూరు, ఏప్రిల్ 9: మండలంలోని అమ్మవారిపాలెం పొలాల్లో పేకాట స్థావరంపై పొదలకూరు ఎస్‌ఐ డి రామకృష్ణ మంగళవారం ఆకస్మిక దాడి చేశారు. ఈ దాడిలో రూ. 22,180 నగదుతోపాటు ఏడుగురిని అరెస్టు చేసి కేసు నమోదు చేసినట్లు ఆయన తెలిపారు.

వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యం

● మిక్కిలింపేటలో టీడీపీ నేతల ప్రచారం

కొడవలూరు ఏప్రిల్ 9 : ఓటమి భయంతో వైసీపీ నాయకులు వికృత రాజకీయాలు చేస్తున్నారని, కోవూరు నియోజకవర్గంలో టీడీపీ, జనసే, బీజేపీ కూటమి అభ్యర్థి వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి విజయం తథ్యమని టీడీపీ మండల ఉపాధ్యక్షుడు కోడూరు వెంకటసుధాకర్ రెడ్డి అన్నారు. మండలంలోని మిక్కిలింపేటలో మంగళవారం టీడీపీ నేతలతో కలసి ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఇంటింటికి వెళ్లి ఎంపీ, ఎమ్మెల్యేలుగా పోటీ చేస్తున్న వేమిరెడ్డి దంపతులను ఆశీర్వదించాలని కోరారు. సొంత నిధులతో వారు పేదలకు ఉచిత విద్య, వైద్యం, తాగు నీటిని అందిస్తున్నారని, ప్రజాప్రతినిధులైతే సేవా కార్యక్రమాలు విస్తృతం చేస్తారన్నారు. ఈ కార్యక్రమంలో ఆగ్రామ సర్పంచు కోడూరు చంద్రశేఖర్‌రెడ్డి, కార్యకర్తలు పాల్గొన్నారు.

గ్రామాల్లో భద్రతా బలగాల కవాతు

వెంకటాచలం, ఏప్రిల్ 9 : మండలంలోని ఇడిమేపల్లి, ఎర్రగుంట, వెంకటాచలం, దొడ్డరాజుపాళెం, వడ్డీపాళెం గ్రామాల్లో సీఐ అంకమరావు ఆధ్వర్యంలో కేంద్ర సాయుధ భద్రతా బలగాలు కవాతు నిర్వహించారు. సీఐ అంకమరావు మాట్లాడుతూ ఎన్నికల నియమావళి ప్రతి ఒక్కరూ పాటించాలని, అతిక్రమిస్తే కఠిన చర్యలు తప్పవన్నారు. గ్రామాల్లో ప్రజలు తమకు పూర్తి సహకారం అందించాలని కోరారు.



కవాతు నిర్వహిస్తున్న భద్రతా బలగాలు



జాతీయ రహదారి పై పట్టలు సక్రమంగా కట్టుకోకుండా నిబంధనలకు విరుద్ధంగా వెళ్తున్న పొట్టు ట్రాక్టర్లు

పొట్టు ట్రాక్టర్లతో ప్రమాదాలు

● బెంబేలెత్తుతున్న ప్రయాణికులు, వాహన చోదకులు

వెంకటాచలం, ఏప్రిల్ 9: వెంకటాచలం మండల పరిధిలోని జాతీయ రహదారిపై నిత్యం పొట్టు లోడుతో తిరుగుతున్న ట్రాక్టర్లతో ప్రమాదాలకు గురికావల్సి వస్తోందని ప్రయాణికులు, వాహన చోదకులు వాపోతున్నారు. వెంకటాచలం మీదుగా ముత్తుకూరు, నాయుడుపేట ప్రాంతాల్లో ఉన్న వివిధ పరిశ్రమలకు ఈ పొట్టు ట్రాక్టర్లు వెళ్తుండటంతో వెనుక వచ్చే ద్విచక్ర వాహనదారుల కళ్లలోకి పొట్టు పడుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయి. కాగా, పొట్టు లోడుతో వెళ్లే ట్రాక్టర్లకు పూర్తిస్థాయిలో పట్టలు కట్టుకొని వెనుకవచ్చే వాహనచోదకులకు, ప్రయాణికులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా ట్రాక్టర్ల యాజమానులు చర్యలు తీసుకోవాలి. కానీ నిబంధనలకు విరుద్ధంగా వెంకటాచలం జాతీయ రహదారి, సర్వేపల్లి గ్రామాల మీదుగా ముత్తుకూరు మండలంలోని వివిధ పరిశ్రమలకు, నాయుడుపేట, గూడూరు తదితర ప్రాంతాల్లో ఉన్న వివిధ పరిశ్రమలకు పొట్టు ట్రాక్టర్లను తిప్పుతుండటంతో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్నాయని, ఇప్పటికైనా పొట్టు లోడు రవాణా చేసే ట్రాక్టర్లు నిబంధనలు పాటించేలా పోలీసులు చర్యలు చేపట్టాలని ప్రయాణికులు, ద్విచక్ర వాహనచోదకులు కోరుతున్నారు.

తాటిపర్తిలో దాహం దాహం

పొదలకూరు, ఏప్రిల్ 9 : మండలంలోని తాటిపర్తి గ్రామంలో గత వారం రోజుల నుంచి పంచాయతీ తాగునీటి మోటార్ మరమ్మతులకు గురికావడంతో పంచాయతీ కుళాయిలు ద్వారా తాగునీరు రాక గ్రామస్థులు ఇబ్బందులు పడుతున్నారు. సుమారు వేయి గడపలు వుండే గ్రామంలో సగం మందికి పైగా కుళాయిల ద్వారా పంచాయతీ నీరు అందడం లేదు. అసలే వేసవి కావడంతో నీటి కొరతతో గ్రామస్థులు అల్లాడిపోతున్నారు. పంచాయతీ వాటర్ ట్యాంకుకు నీటిని తీసుకెళ్లే రెండు మోటార్లలో ఒక మోటారు వారం కిందట మరమ్మతులకు గురికావడంతో ఒక మోటారు పైన ఆధారపడడంతో గ్రామంలోని కొంతమందికే తాగునీరు అందుతుంది. మిగిలిన వారు తాగునీటి కోసం ఇబ్బందులు పడుతున్నారు. స్థానికులు అడగడంతో టీడీపీ సానుభూతిపరుడైన మూడో వార్డు మెంబర్ భర్త కర్పూరం వెంకటరామిరెడ్డి వాటర్ ట్యాంక్ తెచ్చి ఇంటింటికీ నీటిని సరఫరా చేస్తున్నారు. ఇప్పటికైనా మరమ్మతుకు గురైన విద్యుత్ మోటారును బాగుచేయించి తాగునీరు అందించాలని గ్రామస్థులు కోరుతున్నారు.



ట్యాంకర్ నుంచి నీటిని తీసుకెళుతున్న మహిళలు

నెల్లూరు సిటీ, రూరల్ కోవూరు, సర్వేపల్లి

నెల్లూరు నగరంలో శ్రీ క్రోధి నామ సంవత్సరం ఉగాది పండుగను మంగళవారం ప్రజలు ఘనంగా జరుపుకున్నారు. ఆలయాల్లో ప్రత్యేక పూజలు, ఉత్సవాలు, ప్రసాద వితరణ, అన్నదానం జరిగాయి. పలుచోట్ల పంచాంగ శ్రవణం చేశారు.

సంబరంగా ఉగాది

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 9 : నగరంలోని ఏసీ సుబ్బారెడ్డి స్పోర్ట్స్ కాంప్లెక్స్‌లో వివేకానంద వాకర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉగాది వేడుకలు జరిగాయి. ఆలూరి శిరోమణిశర్మ పంచాగ శ్రవణం చేశారు. అసోసియేషన్ అధ్యక్షుడు డీవీ సుబ్బరాజు, కార్యదర్శి స్వర్ణ రమేష్‌బాబు, కోశాధికారి కే జయదేవ్, ఏసీ సుబ్బారెడ్డి స్టేడియం వాకర్స్ అసోసియేషన్ అధ్యక్షుడు దాసరి అనంత రామారావు, కార్యదర్శి గుర్రం సురేంద్ర, కోశాధికారి అరిగెల సాయిరాం తదితరులు పాల్గొన్నారు. కాగా, ఫ్రెండ్స్ వాకర్స్ ఆధ్వర్యంలోనూ ఏసీ స్టేడియంలో ఉగాది వేడుకలు జరిగాయి. రాఘవాచార్యులు పంచాగ శ్రవణం చేశారు. సంఘం సభ్యులు సంప్రదాయ దుస్తులతో పాల్గొనడం ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. అధ్యక్షుడు బిరదవోలు రామమోహన్‌రెడ్డి, కార్యదర్శి షేక్ నజీర్ అహ్మద్, కోశాధికారి శానంపూడి సుబ్బరాయుడు, వాకర్స్ ఇంటర్నేషనల్ కోఆర్డినేటర్ నలుబోలు బలరామయ్యనాయుడు పాల్గొన్నారు.

పొట్టేపాలెంలో కోదండరాముడి గ్రామోత్సవం

నెల్లూరు రూరల్: ఉగాది పండుగ సందర్భంగా మండలంలోని పొట్టేపాళెంలో కోదండరాముడికి గ్రామోత్సవం వైభవంగా జరిగింది. ముందుగా రామ మందిరంలో విశేష పూజలు, అనంతరం పల్లకీసేవ నిర్వహించారు.

● వేదగిరి క్షేత్రంలో ఆదిలక్ష్మి, చెంచులక్ష్మి సమేత నరసింహస్వామి వార్లకు విశేష అలంకరణ, ప్రత్యేక పూజలు జరిగాయి. శ్రీవారి దర్శనానికి భక్తులు పెద్ద సంఖ్యలో తరలివచ్చారు. మండలంలోని గ్రామాల్లో గల ఆలయాల్లోను ఉగాది వేడుకలు జరిగాయి. గ్రామ దేవతలకు పొంగళ్లు, సద్ది పోశారు.

కన్యకాపరమేశ్వరికి సారె సమర్పణ

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 : నగరంలోని వాసవీ కన్యకా పరమేశ్వరి ఆలయంలో ఉగాది వేడుకల్లో భక్తులు అమ్మవారికి భక్తిశ్రద్ధలతో సారెను సమర్పించారు. ఉదయం అమ్మవారికి అభిషేకాలు, విశేష పూజలు జరిగాయి.



కన్యకాపరమేశ్వరి ఆలయంలో అన్నదానం చేస్తున్న దాతలు

ఆలయంలో నిత్య అన్నదాన కార్యక్రమం ప్రారంభమైంది. ఆలయ గౌరవాధ్యక్షుడు ముక్కాల ద్వారకానాథ్ దీనిని ప్రారంభించారు. కార్యక్రమంలో అర్బన్ ఆర్య వైశ్య సంఘం అధ్యక్షుడు బైసాని జ్యోతిప్రసాద్, దేవస్థానం చైర్మన్ శ్రీరాంసురేష్, డాక్టర్ మల్లికార్జునరావు, వైభవ్, శ్రీనివాసులు, తదితరులు పాల్గొన్నారు.

సమాజానికి దశ దిశ కవిత్వమే

సమాజానికి దశ దిశను నిర్దేశించేది కవిత్వమేనని నారాయణ దంత వైద్య కళాశాల డీన్ డాక్టర్ ఎస్ శివకుమార్ అన్నారు. మంగళవారం ఉగాది సందర్భంగా టౌనుహాలు రీడింగ్ రూమ్‌లో నెల్లూరు రచయితల సంఘం వినూత్న కవి సమ్మేళనం నిర్వహించింది. దీనిని ప్రారంభించిన ఆయన మాట్లాడుతూ భూత, భవిష్యత్, వర్తమానాలను శాశించేది కవులని తెలిపారు. ఈ సమ్మేళనంలో అనాథలు, దివ్యాంగులు, వైద్య, నర్సింగ్ విద్యార్థులు సందేశాత్మక కవితలను చదివి శ్రోతలను అలరింపజేశారు. ఈ కార్యక్రమంలో నారాయణ దంత వైద్యశాల హెచ్‌వోడీ కన్నన్, మజ్జిగ ప్రభాకర్‌రెడ్డి, చలంచర్ల భాస్కర్‌రెడ్డి, శాఖవరపు వేణుగోపాల్, రసూల్, శివ అంధుల పాఠశాల ఇన్‌చార్జి నారాయణ రెడ్డి, రమ, పెన్నా రచయితల సంఘం అధ్యక్షుడు జయప్రకాష్, సభ్యులు పాల్గొన్నారు.

సరస్వతీ సమాజంలో పంచాంగ శ్రవణం



సరస్వతీ సమాజంలో జరిగిన ఉగాది వేడుకల్లో ప్రముఖులు

నగరంలోని మూలాపేటలో గల అన్నదేవుల గోవిందరెడ్డి సరస్వతీ సమాజంలో మంగళవారం ఉగాది వేడుకలు జరిగాయి. పీ లక్ష్మీనరసింహా రావు పంచాంగ శ్రవణం చేశారు. అగస్త్యరాజు సుబ్బారావు దేవీ భాగవతంపై ప్రవచించారు. ఈ కార్యక్రమంలో పద్యకళాపరిషత్ అధ్యక్షుడు మెట్టు రామచంద్రప్రసాద్, కవి, ఆడిటర్ చిన్ని నారాయణరావు, సరస్వతీ సమాజం అధ్యక్షుడు మోపూరు పెంచలయ్య, బీ రమణయ్య, టీ వెంకటేశ్వర్లు తదితరులు పాల్గొన్నారు.

● మహాత్మాగాంధీనగర్ కృష్ణమందిరంలో పంచాంగ శ్రవణం జరిగింది. వేదాయపాళెం త్యాగరాజస్వామి మందిరం, గాంధీబొమ్మ షిరిడీ సాయిబాబా మందిరంలోనూ విశేష పూజలు, పంచాంగ శ్రవణం, ప్రసాదాల వితరణ జరిగాయి.

శబరి శ్రీరామక్షేత్రంలో వసంత నవరాత్రోత్సవాలు

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 : నగరంలోని శబరి శ్రీరామక్షేత్రంలో మంగళవారం నుంచి వసంత నవరాత్రోత్సవాలు ఘనంగా ప్రారంభమయ్యాయి. ఈ నెల 17 వరకు ప్రతిరోజూ అభిషేకాలు, అర్చనలు, హోమాలు జరుగుతాయని ఆలయ ధర్మకర్తల కమిటీ తెలిపింది. బ్రహ్మోత్సవాల్లో జరిగే విధంగా రోజుకు ఒక రకం పుష్పం, ఒక రకం సమిధలతో అర్చన, హోమాల తోపాటు పాలు, తేనె, నెయ్యితో అభిషేకాలు జరుగుతాయని పేర్కొంది. మంగళవారం రాత్రి ఈ ఉత్సవాలకు అంకురార్పణ జరిగింది.

అంకమ్మ పరమేశ్వరికి...

మూలాపేటలోని అంకమ్మ పరమేశ్వరికి వసంత నవరాత్రి బ్రహ్మోత్సవాలు మంగళవారం ఘనంగా జరిగాయి. ముఖ్య అతిథిగా నగర డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్ పాల్గొని ప్రత్యేక పూజలు చేశారు. అంకమ్మతల్లి మిత్రమండలి ఏర్పాటు చేసిన అన్నదాన కార్యక్రమాన్ని ప్రారంభించారు. మాజీ కార్పొరేటర్ గోగుల నాగరాజు, దయాకర్, కృష్ణారెడ్డి, సుధీర్, సతీష్, శ్రీనివాసరాజు, లోహిత్ తదితరులు పాల్గొన్నారు.

స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చికెన్ పకోడీ సెంటర్‌గా మార్చారు !

● మాజీ మంత్రి పొంగూరు నారాయణ



ఎన్నికల ప్రచారంలో మహిళలతో నారాయణ



ఉపన్యసిస్తున్న మాజీ మంత్రి నారాయణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 9 : మహిళలు ఆర్థికంగా ఎదిగేందుకు తెలుగుదేశం ప్రభుత్వంలో ఏర్పాటు చేసిన స్కిల్ డెవలప్‌మెంట్ సెంటర్‌ను చికెన్ పకోడీ సెంటర్‌గా మార్చిన ఘనత వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ ప్రభుత్వానికే దక్కుతుందని మాజీ మంత్రి, టీడీపీ నగర ఎమ్మెల్యే అభ్యర్థి పొంగూరు నారాయణ మండిపడ్డారు. ఎన్నికల ప్రచారంలో భాగంగా మంగళవారం 42వ డివిజన్‌లో ఆయన పర్యటించారు. 2014-19 కాలంలో ఎన్నో అభివృద్ధి కార్యక్రమాలు తాము చేపట్టగా 2019-24 మధ్య వైసీపీ ప్రభుత్వం అన్ని వ్యవస్థలను నిర్వీర్యం చేసిందని విమర్శించారు. రానున్న ఎన్నికల్లో ప్రజలంతా తెలుగుదేశం పార్టీకి అండగా ఉండి తనను ఎమ్మెల్యేగా, ఎంపీగా వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డిని గెలిపించాలని విజ్ఞప్తి చేశారు.

● నగరంలోని 3వ డివిజన్‌లో పొంగూరు నారాయణ ఎన్నికల ప్రచారం నిర్వహించారు. వైసీపీ నేతలు లక్ష్మీనారాయణ, శ్రీనివాసరావు, జగదీష్ మిత్రబృందం ఆధ్వర్యంలో పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు టీడీపీలో చేరారు. డిప్యూటీ మేయర్ రూప్‌కుమార్ యాదవ్, నారాయణ విద్యాసంస్థల జీఎం విజయభాస్కర్‌రెడ్డి, టీడీపీ నగరాధ్యక్షుడు మామిడాల మధు పాల్గొన్నారు.

● రంజాన్ మాసాన్ని పురస్కరించుకుని నగరంలోని 5వ వార్డులో సిద్దు సుబ్బారెడ్డి సౌజన్యంతో ముస్లిం కుటుంబాలకు టీడీపీ నాయకులు వేమిరెడ్డి పట్టాభిరామిరెడ్డి రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో బత్తల రమణయ్య, ముడియాల నారాయణరెడ్డి, సిద్దు రమణా రెడ్డి, పీ రాంబాబు, ఎస్‌కే వినోద్, ప్రవళిక, శారద, కే గంగాధర్, ఎస్‌కే మస్తాన్ పాల్గొన్నారు.

● నగరంలోని 46వ డివిజన్‌లో నారాయణ కుమార్తె సింధూర ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎమ్మెల్యేగా నారాయణను, ఎంపీగా వేమిరెడ్డిని గెలిపించాలని కోరారు. 45వ డివిజన్‌లోని ఓ కల్యాణ మండపంలో జరిగిన ప్యాన్సీ, జనరల్ మర్చంట్స్ అసోసియేషన్ ఆత్మీయ సమావేశంలో నారాయణ, ఆయన సతీమణి రమాదేవి, కుమార్తె సింధూర పాల్గొన్నారు.

చంద్రబాబు సీఎం అయ్యాక ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం

● రూరల్ టీడీపీ అభ్యర్థి శ్రీధర్‌రెడ్డి

నెల్లూరు రూరల్, ఏప్రిల్ 9 : ఏపీ ముఖ్యమంత్రిగా చంద్రబాబు ప్రమాణస్వీకారం చేసిన అర్ధగంట నుంచే ఆర్టీసీ బస్సుల్లో మహిళలకు ఉచిత ప్రయాణం అందుబాటులోకి వస్తుందని నెల్లూరు రూరల్ టీడీపీ అభ్యర్థి కోటంరెడ్డి శ్రీధర్‌రెడ్డి వెల్లడించారు. మంగళవారం మండలంలోని సజ్జాపురం, గొల్లకందుకూరు గ్రామాల్లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఎలాంటి ఆధారాలు చూపకుండానే మహిళలు ఆర్టీసీ బస్సుల్లో జిల్లా సరిహద్దుల వరకు ప్రయాణం చేయవచ్చన్నారు. చదువుకున్న యువతకు ప్రభుత్వ ప్రైవేట్ రంగాల్లో ఐదేళ్ల పదవీ కాలంలో 20 లక్షల ఉద్యోగాలు కల్పిస్తారని చెప్పారు. ఉద్యోగం వచ్చే వరకు నిరుద్యోగ భృతి అందచేస్తామన్నారు. సామాన్య, మధ్య తరగతి ప్రజలను పీల్చి పిప్పి చేసిన వైసీపీ ప్రభుత్వాన్ని వదిలించుకునేందుకు ప్రజలు సిద్ధంగా ఉన్నారన్నారు. అనంతరం నెల్లూరులోని శ్రీధర్‌రెడ్డి కార్యాలయంలో 26వ డివిజన్‌కు చెందిన కాలేషా, చెరువుపల్లి వెంకటకృష్ణారెడ్డిలను కండువా కప్పి టీడీపీలోకి ఆహ్వానించారు. ఈ కార్యక్రమాల్లో కోటంరెడ్డి గిరిధర్‌రెడ్డి, నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.



గొల్లకందుకూరు ఎన్నికల ప్రచారంలో మాట్లాడుతున్న శ్రీధర్‌రెడ్డి

వైసీపీ ట్రాప్‌లో పడొద్దు : కేతంరెడ్డి

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 9 : వలంటీర్లు వైసీపీ ట్రాప్‌లో పడొవద్దని తెలుగుదేశం పార్టీ నాయకుడు కేతం రెడ్డి వినోద్‌రెడ్డి అన్నారు. టీడీపీ, జనసేన, బీజేపీ కూట మి ఎంపీ, ఎమ్మెల్యే అభ్యర్థులు వేమిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, పొంగూరు నారాయణను గెలిపించాలని కోరుతూ నగరంలోని 42వ డివిజన్‌లో ఆయన ఎన్నికల ప్రచారం నిర్వహించారు. పండగపూట వలంటీర్లకు చంద్రబాబు తీపి కబురు అందించారని, రూ.5వేల జీతాన్ని రూ.10వేలు చేస్తామని ప్రకటించారని చెప్పారు.



వృద్ధురాలితో మాట్లాడుతున్న వినోద్

ఉగాది క్యాలెండర్ ఆవిష్కరణ

నెల్లూరు (విద్య), ఏప్రిల్ 9 : ఉగాది వేడుకల్లో భాగంగా నగరంలోని ఆర్టీసీ కాలనీ వాసులు నూతన సంవత్సర క్యాలెండర్‌ను ఆవిష్కరించారు. ప్రజలంతా సుఖ సంతోషాలతో ఉండాలని, స్నేహపూరిత వాతావరణంలో మెలగాలని కోరుకుంటూ ఉగాది వేడుకలు నిర్వహించామని చెప్పారు. అనంతరం ఉగాది పచ్చడిని, నూతన సంవత్సర తెలుగు క్యాలెండర్‌ను అందరికీ పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో గుంటి కృష్ణకిషోర్, బీ సుధాకర్, జీ మురళీ కృష్ణారెడ్డి, మెటికల శ్రీనివాస్, శేఖరయ్య, శశికుమార్ తదితరులు పాల్గొన్నారు.

మెకానిక్ కుటుంబానికి ఆర్థిక సాయం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 9 : మోటారు బైక్ మెకానిక్ జంషీద్ మరణించటంతో ఆయన కుమార్తె వివాహానికి ఎస్‌పీఎస్‌ఆర్ నెల్లూరు జిల్లా టూవీలర్స్ మెకానిక్స్ వెల్ఫేర్ అసో సియేషన్ తరపున నాయకులు మంగళవారం ఆర్థిక సహాయాన్ని అందచేశారు. జంషీద్ సతీమణికి రూ.25వేల ఆర్థిక సహాయాన్ని అందచేశారు. కార్యక్రమంలో ఆ సంఘం రాష్ట్ర ఉపాధ్యక్షుడు, జిల్లా అధ్యక్షుడు మొహ్మద్ బదురుద్దీన్, జిల్లా ప్రధాన కార్యదర్శి నజీర్‌ఖాన్, నెల్లూరు నగర కార్యదర్శి మునీర్‌బాషా, రూరల్ కార్యదర్శి జమీర్, ప్రచార కార్యదర్శులు మహబూబ్ బాషా, ఖాదర్ బాషా, శ్రీనివాసులు, సమీర్, జలీల్ పాల్గొన్నారు.

మజ్జిగ చలివేంద్రం ప్రారంభం



చిన్నబజార్‌లోని మజ్జిగ చలివేంద్రం

నెల్లూరు (సాంస్కృతికం), ఏప్రిల్ 9 : చిన్నబజార్ న్యూరాజ్యలక్ష్మీహాల్ వద్ద శుభమస్తు ఫౌండేషన్ ఆధ్వర్యంలో మంగళవారం మజ్జిగ చలివేంద్రం ప్రారంభమైంది. దీనిని శుభమస్తు షాపింగ్ మాల్ అధినేతలు భయ్యా శ్రీనివాసులు, భయ్యా రవికుమార్ వారి తల్లిదండ్రులు స్వర్గీయ భయ్యా వెంకటరమణయ్య, సరోజనమ్మ స్మారకార్థం ఏర్పాటు చేశారు. వేసవి ఎండలు ఉన్నంత కాలం చలివేంద్రం కొనసాగుతుందని తెలిపారు.

బుజబుజనెల్లూరులో...

నెల్లూరు రూరల్: ఉగాది సందర్భంగా బుజబుజ నెల్లూరులోని యాదవ స్ట్రీట్ గణేష్ కూడలి వద్ద తిరుమల అనే వ్యక్తి మజ్జిగ చలివేంద్రాన్ని ఏర్పాటు చేశారు. దానిని టీడీపీ నాయకుడు బీ శేషయాదవ్ ప్రారంభించి తిరుమలను ప్రశంసించారు. వేసవి తాపం నుంచి ఉపశమనానికి చలివేంద్రాలు ఎంతో ఉపయోగపడతాయన్నారు.

వైసీపీ పాలనకు చరమగీతం : కోటంరెడ్డి

నెల్లూరు (వైద్యం), ఏప్రిల్ 9 : ఈ ఉగాదితో రాష్ట్ర ప్రజలకు మంచి రోజులు రానున్నాయని, ఐదేళ్ల వైసీపీ పాలనకు రాబోయే ఎన్నికలతో ప్రజలు చరమగీతం పాడేస్తారని టీడీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి కోటంరెడ్డి శ్రీనివాసులురెడ్డి అన్నారు. మంగళవారం నగరంలోని 40వ డివిజన్ కోటమిట్టలో జరిగిన ఉగాది వేడుకల్లో ఆయన పాల్గొని అమ్మవారికి ప్రత్యేక పూజలు చేశారు. నాయకులు గండవరం నాని, తిరుపతి, జాకీర్, సుధీర్, సుధాకర్‌రెడ్డి, నవీన్ తదితరులు పాల్గొన్నారు.

జనతా ఫౌండేషన్ ప్రారంభం

నెల్లూరు(హరనాథపురం), ఏప్రిల్ 9 : నగరంలోని శ్రీహరినగర్ నాల్గో వీధిలో జనతా ఫౌండేషన్ స్వచ్ఛంద సంస్థను న్యాయవాది దాసరి ప్రసాద్ నేతృత్వంలో మంగళవారం ప్రారంభించారు. సేవా కార్యక్రమాలు విస్తృతంగా చేయాలనే ఉద్దేశంతో మిత్రుల సహకారంతో ఫౌండేషన్ ఏర్పాటు చేసినట్లు చెప్పారు. కార్యక్రమంలో నరసింహ, నరేంద్ర, శ్రీహరి, మనోజ్, కిరణ్, కోటి, శివకృష్ణ పాల్గొన్నారు.


తిరుమల ఆలయం ముందు దేవతామూర్తుల సెట్టింగ్
పుష్ప పల్లకిలో తిరుచానూరు పద్మావతీ దేవి


తిరుమల ఆలయంలో ఫల,పుష్పాలంకరణలు


తిరుమల ఆలయంలో అద్దాల మండపం వద్ద అయోధ్య ఆలయ సెట్టింగ్


మల్లాం పురవీధుల్లో దేవతామూర్తుల ఊరేగింపు

వైభవంగా ఉగాది


చందనాలంకారంలో చెంగాళమ్మ

క్రోధినామ సంవత్సర ఉగాది వేడుకలను మంగళవారం ఘనంగా జరుపుకున్నారు.పలు ఆలయాల్లో వైభవంగా ఉగాది ఆస్థానంతో పాటు పంచాంగ శ్రవణం జరిగాయి.తీపి బెల్లం, చేదు వేప పూతలతో కూడిన ఉగాది పచ్చడిని అందరికీ పంచిపెట్టారు.తిరుచానూరు ఆలయంలో మంగళవారం సాయంత్రం పుష్పపల్లకిలో మహాలక్ష్మీదేవి అలంకరణలో పద్మావతీదేవి కొలువై తిరుమాడ వీధుల్లో ఊరేగారు.రాత్రి ఆలయంలో పంచాంగ శ్రవణం నిర్వహించారు.తిరుపతిలోని గోవిందరాజ స్వామి, కోదండరామస్వామి ఆలయాల్లో ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ హిందూధర్మ ప్రచార పరిషత్ ఆధ్వర్యంలో తిరుపతిలోని మహతి కళాక్షేత్రంలో ఉగాది వేడుకలు నిర్వహించారు.సంస్కృత విశ్వవిద్యాలయ ఆచార్యులు వేదాంతం శ్రీవిష్ణుభట్టాచార్యులు పంచాంగశ్రవణం చేశారు. అనంతరం అష్టావధానం జరిగింది.చిట్టమూరు మండలంలోని మల్లాం వళ్లీ దేవసేన స్వయంభు సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో దేవతల గ్రామోత్సవం జరిగింది.విఘ్నేశ్వర స్వామి, వళ్లీ దేవసేన సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షిదేవి సమేత మార్కండేశ్వర స్వామి, దేశమ్మ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప , మహాలక్ష్మి , సీతారాములు, షిరిడీ సాయిబాబా ఉత్సవమూర్తులను ఊరేగించారు. సూళ్లూరుపేటలో చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు.ఆస్థాన మండపంలో లక్ష కుంకుమార్చన నిర్వహించారు. శ్రీకాళహస్తీశ్వరాలయంలో ఉదయం ఉగాది పచ్చడిని భక్తులకు ప్రసాదంగా పంపిణీ చేశారు.సాయంత్రం ఆస్థాన మండపంలో పంచాంగ శ్రవణం జరిగింది.భక్తులు తమ గ్రహగోచారాలను ఆసక్తిగా ఆలకించారు. అనంతరం పగడ చెట్టు వద్ద అవధానులు, కవులు, రచయితలు సాహిత్య గానం చేశారు. రాత్రి స్వామి అమ్మవార్ల ఊరేగింపు వైభవంగా జరిగింది.

- ఆంధ్రజ్యోతి న్యూస్ నెట్‌వర్క్

శ్రీవారి ఆలయంలో ఆకట్టుకున్న అలంకరణలు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) :వేంకటేశ్వరస్వామి కొలువైన తిరుమల క్షేత్రంలో ఉగాది ఆస్థానం సందర్భంగా ఉదయం శ్రీదేవి, భూదేవి సమేత మలయప్పస్వామికి, విష్వక్సేనుల వారికి విశేష సమర్పణ జరిగింది. శ్రీవారి ఉత్సవర్లను బంగారు వాకిలిలో గరుడాళ్వార్‌కు అభిముఖంగా, మరోపీఠంపై విష్వక్సేనులవారినీ వేంచేపు చేశారు. అనంతరం పంచాంగ శ్రవణం జరిగింది. బంగారు వాకిలి వద్ద ఆగమ పండితులు, అర్చకులు శాస్త్రోక్తంగా ఉగాది ఆస్థానం నిర్వహించారు.టీటీడీ ఉద్యానవన విభాగ ఫల, పుష్పాలంకరణలు ఆకట్టుకున్నాయి. 10 టన్నుల సంప్రదాయ పుష్పాలు, 60 వేల కట్ ఫ్లవర్స్‌ను అలంకరణకు వినియోగించారు. ప్రత్యేకించి ఆలయంలో ఆపిల్, ద్రాక్ష, బత్తాయి, నారింజ, కర్బూజ, మామిడి వంటి విభిన్న రకాల పండ్ల గుత్తులు, ఉత్తమజాతి పుష్పాలతో భూలోక వైకుంఠంగా శ్రీవారి ఆలయాన్ని రూపొందించారు.ఆలయంలో ధ్వజస్తంభం వద్ద పుచ్చకాయలతో చెక్కిన దశావతారాలు ప్రత్యేక ఆకర్షణగా నిలిచాయి. అలాగే అయోధ్య రామాలయం, బాలరాముడి సెట్టింగ్,నవధాన్యాలతో రూపొందించిన మత్స్య అవతారం భక్తులను ఆకట్టుకున్నాయి. ఆలయం వెలుపల గొల్లమండపం పక్కన త్రేతా, ద్వాపర, కలియుగాలకు సంబంధించిన శ్రీరాముడు, శ్రీకృష్ణుడు, వేంకటేశ్వరస్వామి,వేదనారాయణ స్వామి, మహావిష్ణువు దశావతరాలు, ఉద్యానవనంలో ఆడుకుంటున్న రామలక్ష్మణ సమేత హనుమంతులు, బాలకృష్ణుడు వంటి పౌరాణిక ఘట్టాలు విశేషంగా ఆకర్షించాయి. ఉద్యానవన విభాగ డిప్యూటీ డైరెక్టర్ శ్రీనివాసులు ఆధ్వర్యంలో దేశంలోని వివిధ ప్రాంతాల నుంచి వచ్చిన 150 మంది పుష్పాలంకరణ కళాకారులు, టీటీడీ గార్డెన్ సిబ్బంది వంద మంది రెండురోజుల పాటు శ్రమించి ఆకర్షణీయమైన ఫల, పుష్పాలంకరణ ఆకృతులను రూపొందించారు.


శ్రీకాళహస్తీశ్వరాలయంలో పంచాంగ శ్రవణం

శుభ కార్యాలకు కోడ్ కష్టాలు!

- బంగారం, వస్త్రాల కొనుగోళ్ళు తప్పనిసరి
- వెంట నగదు తీసుకెళుతుంటే తనిఖీల బెడద
- ఆన్‌లైన్ చెల్లింపులపై అవగాహన లేమి
- క్షేత్రస్థాయిలో అమలు కాని సడలింపులు

ఇది శుభ కార్యాల సీజను. పెళ్ళిళ్ళు, గృహ ప్రవేశాలు వంటి వాటికి ముహూర్తాలు అధికంగా వున్నాయి. దీంతో కళ్యాణ మండపాలు, ఫంక్షన్ హాళ్ళు కళకళలాడుతున్నాయి. అయితే శుభకార్యాలు తలపెట్టుకున్న వారికి సార్వత్రిక ఎన్నికలు చుక్కలు చూపిస్తున్నాయి. ఎన్నికల నేపథ్యంలో ప్రవర్తనా నియమావళి అమల్లోకి వచ్చింది. దానితో పాటే జిల్లావ్యాప్తంగా చెక్‌పోస్టులు వెలిశాయి. వాటితో పాటు ఎక్కడపడితే అక్కడ వాహనాల తనిఖీలు జరుగుతున్నాయి. బంగారం, వస్త్రాలు, ఫర్నిచర్ వంటి వాటి కొనుగోలుకు నగదు వెంట తీసుకెళుతుంటే తనిఖీలలో భాగంగా స్వాధీనం చేసుకుంటున్నారు. నగల కొనుగోలు సంగతేమో కానీ ఆ నగదు వెనక్కు తీసుకోవడానికి శుభకార్యాల నిర్వాహకుల తలప్రాణం తోకకొస్తోంది. ఇలాంటి వాటికి సడలింపులున్నాయని అధికారులు చెబుతున్నప్పటికీ క్షేత్రస్థాయిలో అవేవీ అమలు కావడం లేదు. దీంతో ఎన్నికల సంగతి తెలియక బుద్ధి తక్కువై శుభకార్యాలు పెట్టుకున్నామంటూ బాధితులు వాపోతున్నారు.

తిరుపతి క్రైం, ఏప్రిల్ 9: జిల్లాలో శుభ ముహూర్తాలు వుండడంతో ఈ సీజనులో పెళ్ళిళ్ళు అధికంగా పెట్టుకుంటున్నారు. ఈ నెల 18, 19,20,21,24,26,27 తేదీల్లో వివాహాలకు శుభ ఘడియలు వున్నాయి. తిరుపతితో పాటు జిల్లా అంతటా పెద్దసంఖ్యలో పెళ్ళిళ్ళు వున్నాయి. ఈనెల 27 నుంచి మూడు నెలల వరకు శుభ కార్యాలకు మూఢం అడ్డు వస్తోంది. దీంతో ఆ లోపే గృహ ప్రవేశాలు, శంకుస్థాపనలు, చిన్నారులకు నామకరణం వంటి కార్యక్రమాలు కూడా ఎక్కువగా జరుగుతున్నాయి. ఇటీవలి కాలంలో శుభ కార్యాలకు కానుకలు ఇచ్చే అలవాటు బాగా పెరిగింది. ఇక పెళ్ళంటే మాటలు కాదు కదా? నగలు కొనుగోలు చేయాలి. కొత్త బట్టలు కొనాలి. కళ్యాణ మండపాలకు అడ్వాన్సులు చెల్లించాలి. మంగళ వాయిద్యాలు మొదలుకుని పౌరోహిత్యం, బ్యూటీషియన్, ఫొటోగ్రఫీ, వీడియోగ్రఫీ, డెకరేషన్, క్యాటరింగ్.. ఇలా ఒకటా రెండా అన్నింటికీ ముందుగానే మాట్లాడుకుని అడ్వాన్సులు కట్టాలి. అమ్మాయిల తల్లిదండ్రుల్లో ఎక్కువమంది కొత్త ఫర్నిచర్ కూడా కొనుగోలు చేస్తుంటారు. ఇందులో ఒకటి రెండు మినహా మిగిలిన వాటికి రూ. లక్షల్లోనే చెల్లింపులు. దీంతో ఇంటి నుంచీ బయలు దేరితే జేబులో రూ.లక్షలు వుండాల్సిందే. సాధారణ రోజుల్లో నగదు వెంట తీసుకుని ప్రయాణించడం ఇబ్బందేమీ కాదు కానీ ఇపుడు సార్వత్రిక ఎన్నికలు జరుగుతున్నాయి. గత నెల 16న ఎన్నికల షెడ్యూలు వెలువడింది. అదే రోజు నుంచీ ఎన్నికల కోడ్ అమల్లోకి వచ్చింది. కనీసం ఐదు తులాల బంగారం కొనాలన్నా రూ. 3 లక్షల పైనే అవుతుంది. కొత్త బట్టలూ రూ.లక్షల్లోనే. చెక్‌పోస్టుల్లో, మార్గమధ్యంలో తనిఖీలు చేపడుతున్న పోలీసులు రూ. 50 వేలకు మించి నగదు దొరికితే సీజ్ చేస్తున్నారు. యక్ష ప్రశ్నలు వేస్తున్నారు. పోలీసు స్టేషన్‌కు పోవడంతో పాటు నగదుకు ఆధారాలు చూపి వెనక్కు తీసుకునేసరికి చుక్కలు కనిపిస్తున్నాయి.కొందరు ఆధునిక టెక్నాలజీ సాయంతో మొబైల్ నెట్ బ్యాంకింగ్ ద్వారా చెల్లింపులు జరుపుతున్నా ఎక్కువమంది నగదు చెల్లింపులే చేస్తున్నారు. శుభమా అని శుభకార్యాలు పెట్టుకుని కొనుగోళ్లకు బయల్దేరితే తీరా పోలీసు స్టేషన్లకు చేరాల్సి వస్తోంది. ఇది వారిని తీవ్ర వేదనకు గురి చేస్తోంది.



నిబంధనల్లో స్పష్టత ఏదీ?

చట్ట ప్రకారం రూ. 50 వేలు మించి నగదు చెల్లింపులకు పాన్ కార్డు వుండాలి. తనిఖీల్లో రూ. 50 వేలకు మించి నగదు వుంటే లెక్కలు చెప్పాలని అధికారులు చెబుతున్నారు. మళ్ళీ అదే అధికారులు రూ. 10 లక్షలకు మించి పట్టుబడితే ఆదాయ పన్ను శాఖ అధికారులకు సమాచారం ఇచ్చి అప్పగిస్తామంటున్నారు. మరోవైపు రూ. 5 లక్షల వరకూ పర్వాలేదని, అది దాటితే లెక్కలు, ఆధారాలూ చూపాలని వారే చెబుతున్నారు. దీనిపై స్పష్టత లేకపోవడంతో పాటు క్షేత్రస్థాయిలో పోలీసులు రూ. 50 వేలు పైబడి నగదు దొరికితే చాలు స్టేషన్లకు తీసుకెళుతున్నారు. ఆ నగదు వాపస్ తీసుకోవడానికి బాధితులకు రోజులు పడుతోంది. పెళ్ళి పత్రిక చూపిస్తే వదిలేస్తామని అధికారులు చెబుతున్నా చాలావరకూ పెళ్ళి ముహూర్తానికి పదిహేను రోజుల ముందు మాత్రమే పత్రికలు ముద్రించే పరిస్థితి వుంది. కానీ నగలు, బట్టలు మాత్రం చాలా ముందుగానే కొనుగోలు చేస్తారు. దీంతో అందరూ పెళ్ళి పత్రికలు చేతపట్టుకుని నగదుతో ప్రయాణించాలంటే వీలు కాదు. నిజానికి ఎన్నికల్లో ఓటర్లకు నగదు పంపిణీ పోలింగ్‌కు ఒకటి రెండు రోజులు ముందు మాత్రమే జరగడం ఆనవాయితీ. నోటిఫికేషన్ వెలువడ్డాక కఠినంగా ఆంక్షలు అమలు చేసినా పర్వాలేదు కానీ షెడ్యూలు నుంచే సుమారు రెండు నెలల పాటు సామాన్య జనాన్ని, అవసరార్థం నగదుతో వెళుతున్న వారిని తనిఖీల పేరిట వేధించడం విమర్శలకు దారి తీస్తోంది. భారీ మొత్తాలు దొరికితే చట్ట ప్రకారం వ్యవహరించడం తప్పదు. కానీ రూ. 5 లక్షల లోపు స్వల్ప మొత్తాలకు నోటిఫికేషన్ కంటే ముందు నుంచీ ఆంక్షలు విధించడం సరికాదన్న అభిప్రాయం సర్వత్రా వ్యక్తమవుతోంది.




రైతులకు, సామాన్యులకు ఇబ్బంది లేదు

సార్వత్రిక ఎన్నికల నేపథ్యంలో తనిఖీలు వున్నప్పటికీ రైతులు, సామాన్యుల విషయంలో ఎలాంటి ఇబ్బందులూ కలిగించడం లేదు. నగదుతో ప్రయాణించే వారు తగిన పత్రాలు వెంట వుంచుకోవాలి. ఉదాహరణకు బ్యాంకు నుంచీ నగదు డ్రా చేసిన రశీదులు, లేదా పాస్ బుక్ వుండాలి. రూ. 5 లక్షల వరకూ నగదు వున్నా సామాన్యులు, రైతుల విషయంలో ఇబ్బంది వుండదు. శుభ కార్యాలకు సంబంధించి కూడా ఇదే వర్తిస్తుంది. పెళ్ళి పత్రిక వంటి ఆధారాలు చూపితే చాలు. నగదుతో వెళుతున్న వ్యక్తి నేపథ్యం, స్థాయిని బట్టి విచక్షణతో వ్యవహరిస్తాం. హోల్ సేల్ వ్యాపారులు, వడ్డీ వ్యాపారులు, బంగారు నగర వర్తకులు వంటి వారిపై ఎక్కువగా దృష్టి పెడతాం. వారి వద్ద నగదు దొరికితే లెక్కలు పక్కాగా చూపాల్సిందే. రూ. 5 లక్షల లోపు అయితే జీఎస్టీ అధికారులకు అప్పగిస్తాం. అంతకు మించితే ఆదాయ పన్ను శాఖకు సమాచారమిస్తాం. ఏ స్థాయిలో నగదు పట్టుబడినా తగిన లెక్కలు, ఆధారాలు చూపితే సమస్య లేదు. ప్రత్యేకించి శుభ కార్యాల కోసం నగదుతో వెళ్ళే వారు కనీస ఆధారాలు చూపితే చాలు.

- సురేంద్రరెడ్డి, తిరుపతి డీఎస్పీ

తిరుపతి ఎంపీ అభ్యర్థిగా చింతా మోహన్

రెండో జాబితాతో అనుమానాలకు తెరదించిన కాంగ్రెస్ అధిష్ఠానం



తిరుపతి , ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి) : ఇండియా కూటమి పొత్తులో భాగంగా తిరుపతి అసెంబ్లీ సీటు సీపీఐకి వెళ్లడంతో ఎంపీ సీటు కూడా ఇతరులకు కేటాయిస్తారేమోనన్న అనుమానాలకు కాంగ్రెస్ అధిష్ఠానం తెరదించింది. మంగళవారం విడుదల చేసిన రెండోజాబితాలో తిరుపతి ఎంపీ అభ్యర్థిగా డాక్టర్ చింతా మోహన్‌కే అవకాశం కల్పించింది. తిరుపతి లోక్‌సభ నియోజకవర్గ పరిధిలో పార్టీకి పెద్దదిక్కుగా ఉన్న చింతా మోహన్ రాష్ట్ర విభజన అనంతరం 2014, 2019 సాధారణ ఎన్నికల్లోనూ, 2021 ఉప ఎన్నికల్లోనూ కాంగ్రెస్ తరపున ఎంపీగా పోటీ చేసి ఓటమి చెందారు. అయినా పార్టీనే అంటిపెట్టుకుని కాంగ్రెస్ జెండాను ఊరూ వాడా తిప్పారు. అయితే ఎంపీ సీటు తనకు వస్తుందని రిపబ్లికన్ పార్టీ ఆఫ్ ఇండియా అధ్యక్షుడు అంజయ్య ఇటీవల మీడియా ముందు ఇండియా కూటమి తరపున స్వీయ ప్రకటన చేశారు. అసెంబ్లీ సీటుతో పాటు ఎంపీ సీటు కూడా ఇండియా కూటమికి వెళ్లే అవకాశాలున్నాయన్న వార్తల నేపథ్యంలో చింతా మోహన్ పదిరోజులుగా ఢిల్లీలో మకాం వేశారు.ఎట్టకేలకు ఏఐసీసీలో తనకున్న ప్రాబల్యాన్ని మరోసారి చాటుకున్నారు. ఆయన తిరుపతి ఎంపీగా ఉప ఎన్నికలతో కలిపి పదకొండోసారి పోటీ చేయబోతున్నారు.ఆరు సార్లు ఎంపీగా గెలిచి, ఒక పర్యాయం కేంద్ర మంత్రిగా కూడా పనిచేశారు.

వైసీపీ శ్రేణులకు పండుగ బహుమతి!

- ఒకటిన్నర సెంటు ఇంటి స్థలానికి ఎంజాయ్‌మెంటు పట్టా

రేణిగుంట, ఏప్రిల్ 9 : రేణిగుంట పట్టణంలో ఎంపిక చేసిన వైసీపీ కార్యకర్తలకు పండుగ బహుమతి పంపిణీ జరిగింది.ఉగాది, రంజాన్ పండుగలను పురస్కరించుకుని ముఖ్య ప్రజాప్రతినిధి కుమారుడు ఇంటి పట్టాలు పంపిణీ చేశారు. మంగళవారం మధ్యాహ్నం పట్టణంలో జరిగిన వైసీపీ కార్యకర్తల అత్యవసర సమావేశంలో రానున్న ఎన్నికల్లో ఎమ్మెల్యే మధన్నను మళ్లీ గెలిపించాల్సిందిగా విజ్ఞప్తి చేశారు. అనంతరం మండల పరిధిలోని అడుసుపాళెంలో ప్రభుత్వ భూమికి సర్వే నెంబరు వేసి ఆ భూమిలో ఎనిమిది సంవత్సరాలుగా కాపురం ఉంటున్నట్లు, తహసీల్దారుకు అర్జీ పెట్టుకుంటే ఆ విషయాన్ని గుర్తించి 2016లో ఒకటిన్నర సెంటు పట్టా ఇచ్చినట్లు చూపుతున్న పత్రాలను వైసీపీ క్యాడర్‌కు పంపిణీ చేశారు. అయితే మధన్న ఎమ్మెల్యేగా ఈసారి గెలిచిన తరువాతే ఇంటి జాగాలు చూపిస్తామనడం కొసమెరుపు.దీంతో ఈ ఇంటి పట్టాలు అసలా, డూప్లికేటా అని తీసుకున్నవాళ్ల అనుమానం వ్యక్తం చేస్తున్నారు.

వైభవంగా సకలదేవతామూర్తుల గ్రామోత్సవం



దేవతల వేషధారణలో నృత్య ప్రదర్శన చేస్తున్న కళాకారులు

చిట్టమూరు, ఏప్రిల్ 9: మండలంలోని మల్లాంలో వెలసిన శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి ఆలయంలో సకల దేవతల ఉత్సవ మూర్తుల గ్రామోత్సవం మంగళవారం వైభవంగా జరిగింది. ఆలయ కమిటీ ఛైర్మన్ చిల్లకూరు సాయికుమార్‌రెడ్డి ఆధ్వర్యంలో ఉగాది పర్వదినం సందర్భంగా ఆలయంలో ఉన్న తొమ్మిదిమంది దేవతా ఉత్సవమూర్తులను ప్రత్యేక పుష్పాలతో ఆలయ ప్రధాన అర్చకులు భానుప్రకాష్ శర్మ అలంకరించారు. విఘ్నేశ్వర స్వామి, శ్రీవల్లీ దేవసేన సమేత సుబ్రహ్మణ్యేశ్వర స్వామి, కామాక్షీ దేవి సమేత మార్కండేశ్వరస్వామి, గ్రామశక్తి దేశమ్మ, శ్రీదేవి భూదేవి సమేత వేంకటేశ్వర స్వామి, అయ్యప్ప స్వామి, మహాలక్ష్మి, సీతారాములు, సాయిబాబా ఉత్సవ మూర్తులను గ్రామోత్సవంలో ఊరేగించారు. ఈ సందర్భంగా మహంకాళి, దేవతల వేషధారణలో భక్తుల నృత్య ప్రదర్శన ఆకట్టుకుంది.

కనులపండువగా సాయిబాబా పుష్పయాగం



సాయిబాబా పుష్పయాగంలో భక్తులు

నాయుడుపేట, ఏప్రిల్ 9: నాయుడుపేట పట్టణం అగ్రహారపేటలోని షిరిడీ సాయిబాబాకు కనులపండువగా పుష్పయాగం చేశారు. మంగళవారం క్రోధినామ ఉగాది సందర్భంగా షిరిడీ సాయిబాబా ఆలయ కమిటీ సభ్యులు 37 రకాలైన 1000 కిలోల పుష్పాలు, జాజి, పత్రి, సుగంధ ద్రవ్యాలతో పుష్పాభిషేకం చేశారు. భక్తులు పెద్దసంఖ్యలో పుష్పాభిషేకంలో పాల్గొన్నారు. భక్తులకు ఆలయ కమిటీ సభ్యులు ఉగాది పచ్చడితోపాటు తీర్థ ప్రసాదాలను అందజేశారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ అధ్యక్షుడు దాసరి ప్రభాకర్ నాయుడు, కార్యదర్శి చింతపూడి శ్రీధర్‌కుమార్, కోశాధికారి పూనాటి తిరుమలనాయుడు, ఉపాధ్యక్షుడు ముత్యాల్‌రెడ్డి, రమేష్, సిద్ధార్థ, ప్రసాద్‌రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

టీడీపీలో చేరిన వైసీపీ శ్రేణులు



టీడీపీలో చేరిన వారితో కురుగొండ్ల రామకృష్ణ, లక్ష్మీసాయిప్రియ

డక్కిలి, ఏప్రిల్ 9: డక్కిలి మండలంలోని తీర్థంపాడు గ్రామానికి చెందిన 30 వైసీపీ కుటుంబాల వారు మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, టీడీపీ అభ్యర్థి కురుగొండ్ల లక్ష్మీసాయిప్రియ సమక్షంలో మంగళవారం టీడీపీలో చేరారు. అలాగే దగ్గవోలు గ్రామానికి చెందిన పలువురు మాజీ ఎమ్మెల్యేని కలిసి టీడీపీలో చేరే విషయమై చర్చించారు. ఈ సందర్భంగా కురుగొండ్ల రామకృష్ణ మాట్లాడుతూ నియోజకవర్గంలో ప్రతి ఒక్కరూ టీడీపీకి అండగా నిలుస్తున్నారని, వచ్చే ఎన్నికల్లో తన కుమార్తె లక్ష్మీసాయిప్రియ 50 వేల మెజార్టీతో విజయం సాధిస్తుందని దీమా వ్యక్తం చేశారు. ఎమ్మెల్యే అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ మాట్లాడుతూ అల్తూరుపాడు రిజర్వాయరు నిర్మించాలన్నది తన తండ్రి రామకృష్ణ కల అని, టీడీపీ అధికారంలోకి రాగానే దాన్ని పూర్తి చేయడానికి కృషి చేస్తానని చెప్పారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు పోలంరెడ్డి కోటేశ్వరరెడ్డి, మాజీ జడ్పీటీసీ ఏలేశ్వరం రామచంద్రయ్యనాయుడు, చెలికం బాస్కరరెడ్డి, టీడీపీ ప్రధాన కార్యదర్శి కుమార్ యాదవ్, హరినాద్ నాయుడు తదితరులు వున్నారు.

బాలాంజనేయస్వామి ఆలయంలో

శ్రీరామనవమి వసంతోత్సవాలు

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9: సూళ్లూరుపేటలోని బాలాంజనేయస్వామి ఆలయంలో మంగళవారం శ్రీరామనవమి వసంతోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఉత్సవాల్లో స్వామివారు రోజుకొక అలంకారంలో భక్తులకు దర్శనమివ్వనున్నారు. తొలిరోజు వైకుంఠవాసుడి అలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఉదయం ఆలయ ప్రధాన అర్చకులు దీవి లక్ష్మీనారాయణ ఆధ్వర్యంలో స్వామివారికి విశేష పూజలు చేశారు.



వైకుంఠవాసుడి అలంకారంలో బాలాంజనేయస్వామి

గుర్తుతెలియని వాహనం ఢీకొని ఒకరికి గాయాలు

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని మునిరత్నంనగర్ సమీపంలో ఆటోను గుర్తుతెలియని వాహనం ఢీకొన్న సంఘటనలో ఒకరికి తీవ్ర గాయాలయ్యాయి. చిట్టమూరు మండలం మొలకలపూడి గ్రామానికి చెందిన దామోదర్, ఆయన కుమార్తె లోహిత ఆటోలో నాయుడుపేటకు బయలుదేరారు. మునిరత్నంనగర్ సమీపంలోకి రాగానే గుర్తుతెలియని వాహనం ఢీకొని వెళ్లిపోయింది. ఈ సంఘటనలో ఆటో నడుపుతున్న దామోదర్ తీవ్రంగా గాయపడగా, లోహిత స్వల్పగాయాలతో బయటపడింది. దామోదర్‌ను 108వాహనంలో స్థానిక ప్రభుత్వాస్పత్రికి తరలించారు. ప్రాథమిక చికిత్స అనంతరం మెరుగైన వైద్యసేవలకై తిరుపతికి తీసుకెళ్లారు. పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

మద్యం విక్రయాలపై ఈసీ నిఘా పెంచాలి

తెలుగు యువత

తిరుపతి అర్బన్, ఏప్రిల్ 9: రాష్ట్రంలో మద్యం విక్రయాలపై ఎన్నికల కమిషన్ (ఈసీ) నిఘా పెంచాలని తెలుగు యువత రాష్ట్ర ప్రధాన కార్యదర్శి రవినాయుడు కోరారు. మంగళవారం ప్రెస్‌క్లబ్‌లో మీడియాతో మాట్లాడుతూ.. 2019 ఉగాది పర్వదినాన సంపూర్ణ మద్యపాన నిషేధం చేస్తామన్న చెప్పిన జగన్.. చివరకు రాష్ట్రాన్ని మద్యాంధ్రప్రదేశ్‌గా మార్చేశారని ధ్వజమెత్తారు. గతంలో ఉన్న బ్రాండ్స్ రద్దుచేసి.. కొత్తపేర్లతో మరిన్ని ప్రవేశపెట్టి విచ్చలవిడిగా విక్రయిస్తున్నారన్నారు. దీనిపై మహిళలు నిలదీయాలని పిలుపునిచ్చారు. మరోవైపు నాణ్యత లేని మద్యం విక్రయిస్తుండడంతో ఎంతోమంది ప్రాణాలు కోల్పోయారని ఆవేదన వ్యక్తం చేశారు. ఈ ఎన్నికల్లో మద్యం ద్వారా గెలవాలని చూస్తున్నారని, ఈ క్రమంలోనే రాష్ట్రవ్యాప్తంగా 3,500 దుకాణాల్లో 15వేల మంది సొంతపార్టీ కార్యకర్తలను అవుట్‌సోర్సింగ్ పద్ధతిలో నియమించారని ఆరోపించారు. ప్రతి దుకాణంలో టోకెన్ విధానంతో వైసీపీ కార్యకర్తల కనుసన్నల్లో అనధికారంగా మద్యం బాటిల్స్ అందజేస్తూ.. ఓటర్లను ప్రలోభాలకు గురిచేస్తున్నారని ఆగ్రహించారు. అందువల్ల మద్యం విక్రయాలను ఈసీ పరిధిలోకి తేవాలని విన్నవించారు. అలాగే డిజిటల్ పేమెంట్ సిస్టం తీసుకొచ్చి, డిస్టలరీస్‌పై నిఘా పెట్టాలన్నారు. ఇప్పటివరకు జరిగిన విక్రయించిన మద్యంపై శ్వేతపత్రం విడుదల చేయాలని, ఆడిటింగ్ జరపాలని డిమాండ్ చేశారు. నాయకులు కృష్ణయాదవ్, కర్ణం సందీప్, శ్రీనివాస్‌యాదవ్, శ్రీనివాసులు, తోటవాసు తదితరులు పాల్గొన్నారు.



మీడియాతో మాట్లాడుతున్న రవినాయుడు











గూడూరు: నటరాజస్వామికి పూజలు - బంగారుచీరలో మహాలక్ష్మమ్మ - వెంకటగిరి టౌన్: గాజుల అలంకరణలో కాత్యాయనీదేవి - చిల్లకూరు: ముత్యాలచీరలో ముత్యాలమ్మ - సూళ్లూరుపేట: మత్స్యావతారంలో మద్వేంకటరామ్మూరి

వైభవంగా ఉగాది వేడుకలు

గూడూరు, ఏప్రిల్ 9: తెలుగు నూతన సంవత్సరాది ఉగాది పండుగను మంగళవారం ప్రజలు వేడుకగా జరుపుకున్నారు. పట్టణంలోని అమ్మవార్ల ఆలయాల్లో ప్రత్యేక పూజలు జరిపారు. స్థానిక బొడ్డుచౌక సెంటర్‌లోని మహాలక్ష్మమ్మ ఆలయంలో అమ్మవారిని బంగారుచీరతో అలంకరించి పూజలు జరిపారు. గంగమ్మ ఆలయంలో అమ్మవారిని వెండిచీరతో అలంకరించి పూజలు చేశారు. రాజరాజేశ్వరీదేవి ఆలయంలో అమ్మవారికి పూజలు చేసి అన్నదానం చేశారు. రెండో పట్టణ పరిధిలోని డీవీఆర్‌పల్లిలోని మహాలక్ష్మమ్మ ఆలయంలో నిర్వహించిన పూజా కార్యక్రమాలలో టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి పాశిం సునీల్‌కుమార్, తిరుపతి బీజేపీ ఎంపీ అభ్యర్థి వరప్రసాదరావు పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. మాళవ్యానగర్‌లోని శ్రీరామరక్షా కుటీరంలో ఉగాది పూజలు నిర్వహించి, గోపాలకృష్ణ గురుగుహ ఆధ్వర్యంలో పంచాంగ శ్రవణం జరిపారు. స్థానిక సాయి సత్సంగ నిలయంలో నిర్వాహకుడు కోట సునీల్‌కుమార్ ఆధ్వర్యంలో విజయదుర్గాదేవికి పూజలు నిర్వహించి, నవావరణ హోమం జరిపారు. మధుసూదన్‌చే పంచాగ శ్రవణం జరిపారు. పోలేరమ్మ రచ్చల వద్ద భక్తులు అంబళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీ హాలులోని పొన్నలూరు వీరరాఘవరెడ్డి సంగీత, నృత్య పాఠశాలలో ఉగాది సందర్భంగా నృత్య ఉపాధ్యాయురాలు మల్లికా, విద్యార్థినులు నటరాజస్వామికి పూజలు నిర్వహించారు.

సూళ్లూరుపేట: పట్టణంలోని చెంగాళమ్మ పరమేశ్వరి స్వర్ణకిరీట చందనాలంకారంలో భక్తులకు దర్శనమిచ్చారు. గోపూజ అనంతరం అమ్మవారి ఆస్థాన మండపంలో లక్షకుంకుమార్చన నిర్వహించారు. ఉభయకర్తలుగా ఒంగోలు ఎంపీ మాగుంట శ్రీనివాసులు రెడ్డి, మాగుంట పార్వతమ్మ, పుష్పాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఆర్ 900 షోరూం యజమానులు, చందనాలంకరణ ఉభయకర్తలుగా నెల్లూరు ఎంవీఐ చెన్నూరి రాంబాబు, సత్యకుమారి దంపతులు, పూజ ద్రవ్యాల విరాళదాతలుగా చిట్టేటి పెరుమాల్, గోవిందమ్మ దంపతులు, అన్నదాన ఉభయకర్తలుగా దేవారెడ్డి మునికృష్ణారెడ్డి, రాజేశ్వరి దంపతులు వ్యవహరించారు. భక్తులు అధిక సంఖ్యలో విచ్చేసి అమ్మవారిని దర్శించుకొన్నారు. ముందుగా సహాయ కమిషనర్ దబ్బుగుంట వెంకటేశ్వర్లు జ్యోతిని వెలిగించి ఉగాది వేడుకలను ప్రారంభించారు. అదేవిధంగా పట్టణంలోని మద్వేంకటరామ్మూరి స్వామి ఆలయంలో స్వామివారికి పుష్పాలంకరణ చేశారు. బ్రాహ్మణ వీధిలో ఉన్న సీతారాముల దేవస్థానంలో వసంత నవరాత్రుల ఉత్సవాలు ప్రారంభమయ్యాయి. తొలిరోజు స్వామివారు మత్స్యావతారంలో భక్తులకు దర్శనమిచ్చారు. ఈ ఉత్సవాలు శ్రీరామనవమి వరకు జరుగుతాయని ఆలయ కమిటీ ఛైర్మన్ కారంశెట్టి మల్లికార్జున శర్మ తెలిపారు.

చిల్లకూరు: తూర్పుకనుపూరులో వెలసిన ముత్యాలమ్మకు ప్రత్యేక పూజలు నిర్వహించారు. అమ్మవారిని ముత్యాలచీరలో అలంకరించారు. భక్తులు పొంగళ్లు పెట్టి అమ్మవారికి నైవేద్యంగా నివేదించారు. అలాగే కలవకొండ గ్రామంలో వెలసిన లక్ష్మీనరసింహస్వామి ఆలయంలో స్వామివారికి అభిషేకాలు, ప్రత్యేక పూజలు, పంచాగశ్రవణం నిర్వహించారు. సాయంత్రం స్వామి, అమ్మవార్లకు పల్లకీసేవ నిర్వహించారు.

నాయుడుపేట టౌన్: పట్టణంలోని గడియారం సెంటర్ వద్ద వెలసిన గ్రామదేవత పోలేరమ్మ ఆలయం వద్ద ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఉభయదాతలు అంబళ్లుపోసి మొక్కులు తీర్చుకున్నారు. అలాగే మానసాదేవి, అంకమ్మ ఆలయాల్లో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

వెంకటగిరి టౌన్: పట్టణంలోని పోలేరమ్మ ఆలయం, తూర్పువీధి కలివేలమ్మ, హరహర క్షేత్రం, వెంకటేశ్వర స్వామి ఆలయాల్లో ఉగాది వేడుకలు జరిగాయి. ఉదయం నుంచి ఆలయానికి భక్తులు పోటెత్తారు. హరహర క్షేత్రంలోని కాత్యాయనీదేవిని గాజులతో అలంకరించారు. టీడీపీ అభ్యర్థి లక్ష్మీసాయిప్రియ, మాజీ ఎమ్మెల్యే కురుగొండ్ల రామకృష్ణ, వైసీపీ జిల్లా అధ్యక్షుడు, వెంకటగిరి నియోజకవర్గ సమన్వయకర్త నేదురుమల్లి రాంకుమార్ రెడ్డి అమ్మవారిని దర్శించుకున్నారు.

కోట: పట్టణంలోని గ్రామదేవత కోటమ్మ ఆలయంలో అమ్మవారికి నేమలి పింఛాలతో చీర కట్టారు. భక్తులు అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయ ధర్మకర్త నల్లపరెడ్డి జగన్‌మోహన్‌రెడ్డి, కవితమ్మ దంపతుల ఆధ్వర్యంలో భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు. ఆలయ ప్రాంగణంలో పంచాంగ శ్రావణం జరిగింది. అదే విధంగా పట్టణంలోని వాసవీకన్యకా పరమేశ్వరి ఆలయం, విద్యానగర్‌లోని విజయగణపతి ఆలయం, షిరిడీ సాయిబాబా ఆలయాలలో ఉగాది సంబరాలు జరిగాయి. భక్తులకు ఉగాది పచ్చడి అందజేశారు.









గూడూరు: వెండిచీర అలంకారంలో పూజలందుకుంటున్న గంగమ్మ - విజయదుర్గాదేవికి పూజలు నాయుడుపేట: ప్రత్యేక పుష్పాలంకరణలో పోలేరమ్మ - కోట: నేమలి చీర అలంకరణలో కోటమ్మ

రాష్ట్రాభివృద్ధి కోసమే కూటమి: నెలవల



కార్యక్రమంలో మాట్లాడుతున్న నెలవల సుబ్రహ్మణ్యం, విజయశ్రీ

దొరవారిసత్రం, ఏప్రిల్ 9: దివాళా తీసిన రాష్ట్రాన్ని అభివృద్ధి పథంలో నడిపించేందుకే టీడీపీ, బీజేపీ, జనసేన కూటమిగా ఏర్పడ్డాయని మాజీ ఎంపీ నెలవల సుబ్రహ్మణ్యం అన్నారు. దొరవారిసత్రం మండలం అక్కరపాక, పోలిరెడ్డిపాళెం, కల్లూరు పంచాయతీల్లో మంగళవారం టీడీపీ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీ, జనసేన నియోజకవర్గ కన్వీనర్ ఉయ్యాల ప్రవీణ్‌తో కలసి ఇంటింటి ప్రచారం నిర్వహించారు. కార్యక్రమంలో టీడీపీ మండల అధ్యక్షుడు వేమసాని శ్రీనివాసులు నాయుడు, మనోహర్‌రెడ్డి, జక్కరయ్య, ప్రసాద్‌నాయుడు, బాబునాయుడు, ఉదయ్‌కుమార్, విజయ్, సుజాతమ్మ, భవానీ, కళ్యాణి, సంపూర్ణమ్మ పాల్గొన్నారు.

హెచ్చరిక బోర్డు తొలగింపు

పెళ్లకూరు, ఏప్రిల్ 9: మండలంలోని తాళ్వాయిపాడు పంచాయతీ నాయుడుపేట పట్టణానికి, ఆరు వరుసల రహదారికి ఆనుకుని ఉండడంతో ఈ ప్రాంతంలో భూములకు గిరాకీ పెరిగింది. ఇక్కడి భూములపై కన్నేసిన రియల్టర్లు ప్రైవేట్ వ్యక్తుల నుంచి భూములను కొనుగోలు చేసి లే అవుట్లు వేస్తూ దానికి సమీపంలో ఉంటున్న ప్రభుత్వ భూములను కబ్జా చేస్తున్నారు. తాళ్వాయిపాడు రెవెన్యూ పరిధిలోని 74/3, 74/22, 74/21 సర్వే నంబర్లలోని 19 సెంట్ల ప్రభుత్వ భూమి ఆక్రమణపై గ్రామస్తులు సోమవారం తహసీల్దారుకు ఫిర్యాదు చేశారు. దీంతో రెవెన్యూ అధికారులు సరిహద్దులు గుర్తించి హెచ్చరిక బోర్డులు ఏర్పాటు చేశారు. అయితే గంటల వ్యవధిలోనే హెచ్చరిక బోర్డును గుర్తుతెలియని వ్యక్తులు చింపేశారు. దీనిపై అధికారులు చర్యలు తీసుకోవాలని గ్రామస్తులు కోరుతున్నారు.

పేదలకు నిత్యావసరాల పంపిణీ

గూడూరు అర్బన్, ఏప్రల్ 9: స్థానిక డీఎస్ఆర్ కమ్యూనిటీహాలులో ఆదివారం రోటరీ వెస్ట్‌క్లబ్ ఆధ్వర్యంలో పేదలకు నిత్యావసరాలను అందజేశారు. కార్యక్రమంలో క్లబ్ సీనియర్ సభ్యుడు ఎల్లసిరి గోపాల్‌రెడ్డి, సనత్‌కుమార్‌రెడ్డి, ధనుంజయరెడ్డి, గిరిబాబు, చంద్రశేఖర్, కృష్ణంరాజు, నాగరాజారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

భృంగి వాహనంపై సంఘమేశ్వరుడు

కోట, ఏప్రిల్ 9: మండల పరిధిలోని గూడలిలో గల కామాక్షీదేవి సమేత సంఘమేశ్వరస్వామి బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రాత్రి భృంగివాహనంపై ఊరేగారు. అశేష భక్తజన సందోహం నడుమ స్వామివారు గూడలి పురవీధుల్లో ఊరేగారు. భక్తులు కొబ్బరికాయలు కొట్టి మొక్కులు తీర్చుకున్నారు. బుధవారం రాత్రి రావణ వాహనంపై సంఘమేశ్వరుడు ఊరేగనున్నారు.

టీటీడీ జేఈవో బాధ్యతల స్వీకారం

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): టీటీడీ హెల్త్, ఎడ్యుకేషన్ జేఈవోగా ఎం.గౌతమి మంగళవారం బాధ్యతలు స్వీకరించారు. గతంలో జేఈవోగా పనిచేసిన సదాభార్గవి బదిలీ అయిన క్రమంలో ఆ స్థానంలో గౌతమిని నియమిస్తూ సోమవారం రాష్ట్రప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిన విషయం తెలిసిందే.మంగళవారం సాయంత్రం తిరుపతిలోని టీటీడీ పరిపాలన భవనంలో ఆమె బాధ్యతలు స్వీకరించారు.



ఉపాధ్యాయుల సేవా కేంద్రం ప్రారంభం

తిరుపతి(విద్య), ఏప్రిల్ 9: ఏపీ ఉపాధ్యాయ సంఘ (ఆపస్) ఆధ్వర్యంలో తిరుపతిలోని న్యూ ఇందిరానగర్‌లో ఏర్పాటు చేసిన ఉపాధ్యాయుల సేవా కేంద్రాన్ని మంగళవారం రాష్ట్ర అధ్యక్షుడు శవన్నగారి బాలాజి ప్రారంభించారు. ఆయన మాట్లాడుతూ.. జిల్లాలో టీచర్ల సర్వీసు, ప్రభుత్వ విద్యారంగానికి సంబంధించిన సమస్యల పరిష్కారానికి ఈ కేంద్రాన్ని ఏర్పాటు చేశామని, చెప్పారు. వివరాలకు జిల్లా ప్రధానకార్యదర్శి జి.సాంబిరెడ్డి (91603 22382), సహాధ్యక్షుడు డాక్టర్ దేవరాజులు (94926 52759), ఉపాధ్యక్షులు దాము(91823 21491), మురళిమోహన్(81427 66765)లను సంప్రదించాలని కోరారు. అలాగే ఈ నూతన కార్యాలయంలో ఉగాది సంబరాలను నిర్వహించి, పంచాంగశ్రవణం చేశారు. జిల్లా గౌరవాధ్యక్షుడు ప్రసాద్‌రాజు, రాష్ట్ర కార్యదర్శి సుభాష్‌చంద్రదాస్, వసంతకుమార్, విజయసింహారెడ్డి తదితరులు పాల్గొన్నారు.

వలంటీర్ల రాజీనామా

వెంకటగిరి టౌన్/డక్కిలి ఏప్రిల్9: వెంకటగిరి మండలం పెట్లూరు పంచాయతీ పరిధిలోని 10 మంది, పాపమాంబపురం పంచాయతీ పరిధిలో ముగ్గురు వలంటీర్లు రాజీనామా చేసినట్లు ఎంపీడీవో నీలకంఠ రెడ్డి మంగళవారం తెలిపారు. అలాగే డక్కిలి సచివాలయ పరిధిలో పనిచేస్తున్న నలుగురు వలంటీర్లు రాజీనామా చేశారు. వలంటీర్లు మునికృష్ణారెడ్డి, ప్రసన్న కుమార్, వెంకయ్య బాబు, సుగుణమ్మ తమ రాజీనామా పత్రాలను ఎంపీడీవో కార్యాలయ సూపరింటెండెంట్ అనురాధాకు అందజేశారు.

రంజాన్ తోఫా పంపిణీ



రంజాన్ తోఫా అందజేస్తున్న జలీల్ అహ్మద్

కోట, ఏప్రిల్ 9: కోట పట్టణంలోని ఎస్‌కేబీ ప్రాంగణంలో మంగళవారం కోట, వాకాడు, చిట్టమూరు మండలాలకు చెందిన 650 నిరుపేద ముస్లిం కుటుంబాలకు గ్రీన్ ఫౌండేషన్ సహకారంతో రంజాన్ తోఫా పంపిణీ చేశారు. కార్యక్రమంలో ఫౌండేషన్ ఛైర్మన్ షేక్ జలీల్ అహ్మద్, ప్రతినిధులు జమీర్, నౌషాద్, నాయబ్‌రసూల్, షంషుద్దీన్, బాబులతోపాటు కిరణ్‌కుమార్, సర్వోత్తమరెడ్డి, మోహన్‌రెడ్డి, మధుయాదవ్, సురేష్‌బాబు తదితరులు పాల్గొన్నారు.

అన్నదానం

నాయుడుపేట టౌన్, ఏప్రిల్ 9: పట్టణంలోని పాత బస్టాండ్ సమీపంలో ఉన్న అంబేడ్కర్ విగ్రహం వద్ద మంగళవారం ఉగాది పండుగ పర్వదినాన్ని పురస్కరించుకొని శరవణభవ మల్లికాంబ ఆశ్రమం ఆధ్వర్యంలో అన్నదానం చేశారు. కార్యక్రమంలో కలికి మాధవరెడ్డి, గూడూరు సుధీర్‌రెడ్డి, అవధానం సుధీర్, వత్తూరు కిషోర్ యాదవ్, నారాయణ, మల్లికార్జున్, సుబ్బారెడ్డి, చెన్నారెడ్డి, పసల చంద్ర పాల్గొన్నారు.

గూడూరు అర్బన్: స్థానిక గమళ్లపాళెంలోని నిరాశ్రయుల కేంద్రంలో ఉగాది పండుగ సందర్భంగా శ్రీకృష్ణసేవా సమితి అధ్యక్షుడు మయూరి శ్యామ్‌యాదవ్ ఆధ్వర్యంలో వృద్ధులకు అన్నదానం చేశారు. కార్యక్రమంలో మహేశ్వరి, రమేష్ తదితరులు పాల్గొన్నారు.

సిమెంటు బెంచీ వితరణ

చిల్లకూరు, ఏప్రిల్ 9: స్థానిక అభయాంజనేస్వామి ఆలయానికి మంగళవారం ప్రగతిసేవాసంస్థ ఆధ్వర్యంలో సిమెంటు బెంచీని వితరణగా అందజేశారు. కార్యక్రమంలో కడివేటి చంద్రశేఖర్, జీ.చంద్రశేఖర్, శ్రీనివాసులు, రామ్మోహన్‌రావు, కరిముల్లా, రాము, కుమార్‌నాయుడు, శివకుమార్‌రెడ్డి, మునిప్రసాద్, శ్రీను, నాగరాజు, సతీష్ పాల్గొన్నారు.

పోలీసుల ఫ్లాగ్ మార్చ్

పెళ్లకూరు, ఏప్రిల్ 9: మండలంలోని చెంబేడు, నెలబల్లి, పుల్లూరు గ్రామాల్లో మంగళవారం పోలీసులు కేంద్ర సాయుధ బలగాలతో కలిసి ఫ్లాగ్ మార్చ్ నిర్వహించారు. చేపట్టారు. నాయుడుపేట రూరల్ సీఐ జగన్మోహన్‌రావు, ఎస్ఐ కుర్రా శ్రీకాంత్, ఏఎస్ఐ సుబ్రహ్మణ్యం తదితరులు పాల్గొన్నారు.



బీజేపీతోనే స్థిరమైన అభివృద్ధి

నాయుడుపేట, ఏప్రిల్ 9: బీజేపీతోనే స్థిరమైన సంక్షేమం, అభివృద్ధి జరుగుతుందని ఆ పార్టీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి సన్నారెడ్డి దయాకర్‌రెడ్డి అన్నారు. నాయుడుపేటలో మంగళవారం బీజేపీ జిల్లా అధ్యక్షుడు చంద్రప్ప, నాయకులతో కలసి పార్టీ జెండా ఆవిష్కరించారు. అనంతరం ఎన్నికల కార్యాలయాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగన్ పాలనలో ప్రజలు చాలా కష్టాలు పడ్డారని, రాష్ట్రం రుణభారంతో ఉందన్నారు. బీజేపీ, టీడీపీ, జనసేన కూటమితోనే రాష్ట్రాభివృద్ధి సాధ్యమవుతుందన్నారు. తిరుపతి ఎంపీ అభ్యర్థి వెలగపూడి వరప్రసాదరావు, సూళ్లూరుపేట నియోజకవర్గ ఎమ్మెల్యే అభ్యర్థి డాక్టర్ నెలవల విజయశ్రీని గెలిపించాలంటూ ఇంటింటి ప్రచారం చేశారు. ఈ కార్యక్రమంలో బీజేపీ జిల్లా ఉపాధ్యక్షుడు జంపాల మాల్యాద్రినాయుడు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు రంగినేని కృష్ణయ్య, పట్టణ అధ్యక్షుడు రాజశేఖర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి చిగురాకుల సురేంద్ర, అత్తలపాళెం మధురెడ్డి, ఎస్సీ మోర్చ జిల్లా అధ్యక్షుడు బొల్లకాయల విజయకుమార్, ఎస్టీ మోర్చా కార్యదర్శి సుందరరావు, అమరావతి రామయ్య తదితరులు పాల్గొన్నారు.



ప్రచారం చేస్తున్న బీజేపీ నాయకులు

ప్రైవేట్ మొబైల్ ఆర్టీవో సేవలు

తడ, ఏప్రిల్ 9: భీములవారిపాళెం చెక్‌పోస్టు వద్ద రవాణాశాఖ కార్యాలయాన్ని మూసివేయడంతో ప్రైవేట్ ఆన్‌లైన్ సెంటర్లకు పండగలా మారింది. రవాణాశాఖకు సంబంధించిన సేవలు అందిస్తామంటూ కామన్ సర్వీస్ సెంటర్లను పలువురు ఏర్పాటు చేశారు. ఓ వ్యక్తి వినూత్నంగా ఆలోచించి మొబైల్ సర్వీస్ సెంటర్‌ను ఏర్పాటు చేసుకున్నాడు. ఓ ట్రక్ ఆటోకు కంప్యూటర్, ప్రింటర్లను ఏర్పాటు చేసుకొని, దానికి నెట్ కనెక్షన్‌ను అనుసంధానం చేసుకొని వాహనదారులకు అవసరమైన సర్వీసులను పర్మింట్‌లను అక్కడే అందజేసేలా ఏర్పాటు చేసుకున్నాడు. మూతపడ్డ రవాణా చెక్‌పోస్టుకు సమీపంలోనే ఈ వాహనాన్ని ఉంచడంతో వాహనదారులంతా దానిని వినియోగించుకుంటున్నారు. ప్రభుత్వానికి చెల్లించాల్సిన పన్నులకు అదనంగా సర్వీస్ చార్జీలను సైతం వసూలు చేస్తున్నారు.



చెక్‌పోస్టు పరిసరాల్లో ప్రైవేట్ వ్యక్తుల నిర్వహణలో ఉన్న మొబైల్ ఆర్టీవో సేవల వాహనం

ఉగాది పచ్చడి పంపిణీ

సూళ్లూరుపేట, ఏప్రిల్ 9: సూళ్లూరుపేటలోని వాసవి, వనిత క్లబ్ ఆధ్వర్యంలో మంగళవారం బాపూజీ వీధిలోని గడియారం సెంటర్ వద్ద ఉగాది పచ్చడి పంపిణీ చేశారు. ముందుగా కన్యకా పరమేశ్వరి ఆలయంలో విశేష పూజలు చేసిన అనంతరం పచ్చడి పంపిణీ చేపట్టారు. కార్యక్రమంలో వాసవి క్లబ్ రీజినల్ ఛైర్మన్ సాయిరాం, అధ్యక్షుడు అభిషేక్, కోశాధికారి శ్యామ్ సుందర్, వనతి క్లబ్ అధ్యక్షురాలు నిర్మలాకుమారి, రాపూరి సుబ్రహ్మణ్యం, పద్మజ, గుర్రం ప్రసాద్, సేగు తిరుమల రావు, ఓలేటి సత్యనారాయణ తదితరులు పాల్గొన్నారు.

శ్రీవారి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు

తిరుమల, ఏప్రిల్ 9 (ఆంధ్రజ్యోతి): తిరుమల వేంకటేశ్వరస్వామి హుండీ ఆదాయం రూ.3.55 కోట్లు లభించింది. ఆదివారం ఉదయం నుంచి రాత్రి వరకు భక్తులు సమర్పించిన హుండీ కానుకలను టీటీడీ సోమవారం పరకామణి లెక్కింపులు నిర్వహించింది. ఈమేరకు ఆదాయం లభించినట్టు మంగళవారం ఉదయం ప్రకటించింది. ఇక, సోమవారం 61,920 మంది భక్తులు శ్రీవారిని దర్శించుకున్నారు. 17,638 మంది తలనీలాలు సమర్పించారు.

కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలు

తిరుపతి(కలెక్టరేట్), ఏప్రిల్ 9: పర్యాటక శాఖ ఆధ్వర్యంలో కలెక్టరేట్‌లో ఉగాది వేడుకలను మంగళవారం నిర్వహించారు. ఎస్వీ వేద విశ్వవిద్యాలయ ఉపకులపతి ఆచార్య రాణి సదాశివమూర్తి, డీన్ వెంకటసుబ్రహ్మణ్యం పంచాంగ శ్రవణం చేశారు. ఈ సందర్భంగా డీఆర్వో పెంచలకిషోర్ మాట్లాడుతూ.. మన మూలాలను ఎప్పటికి మరవకూడదన్నారు. అధికారులు రమణ ప్రసాద్, రూపేంద్రనాథ్‌రెడ్డి, భాస్కర్‌నాయుడు, రామకృష్ణారెడ్డి, బాల కొండయ్య తదితరులు పాల్గొన్నారు.